ప్రజాశక్తి
బుధవారం 16 జులై 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

రైతు బజార్లలో బినామీల బాగోతం!


గుంటూరులో బృందావన్ గార్డెన్స్ రైతు బజార్

- రైతుల ముసుగులో భారీ దోపిడీ
- దుకాణాలను అద్దెకు తీసుకుని అధిక ధరలకు ఇస్తున్న వైనం
- సౌకర్యాలు లేకున్నా భారీగా రుసుం చెల్లిస్తున్న చిరు వ్యాపారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సాధారణ వ్యాపార సముదాయాల్లో కంటే అధిక అద్దెలు వసూలు చేస్తున్న ఉదంతం మార్కెటింగ్ శాఖ నిర్వహిస్తున్న రైతుబజార్లలో వెలుగుచూసింది. అరకొర సదుపాయాలతోనే నిర్వహిస్తున్న రైతు బజార్లలో రైతులకు గతంలో ఉచితంగా దుకాణాలు పెట్టుకునేందుకు 1996లో అప్పటి టిడిపి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఆ తరువాత కొన్ని సంవత్సరాలకు సాధారణ అద్దెలు వసూలు చేయాలని నిర్ణయించారు. గత వైసిపి ప్రభుత్వంలో ఈ అద్దెలు భారీగా పెంచారు. తొలుత ఒక్కో దుకాణానికి రూ.4 వేలు, తరువాత రూ. 7వేల వరకు పెంచారు. జిల్లాలోని పలు రైతు బజార్లల్లో భారీగా అద్దెలు వసూలు చేస్తున్న మార్కెటింగ్ శాఖ కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రధానంగా గుంటూరులోని బృందావన్ గార్డెన్స్ రైతు బజార్లలో ఏమాత్రమూ సదుపాయలు లేకుండా ఎండకి ఎండుతూ వానకు తడుస్తూ విక్రయదారులు కూరగాయాలు విక్రయాలు చేస్తున్నారు. ఒక్కో దుకాణ దారుడి నుంచి మార్కెటింగ్‌శాఖ రూ.7 వేలు వసూలు చేస్తోంది. ఈ అద్దె నగరంలోని ప్రధాన కూడళ్లలో కార్పొరేషన్ దుకాణ సముదాయాల్లో ఉన్న అద్దె కంటే ఎక్కువగా ఉందని విక్రేతలు వాపోతున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రైతు బజార్‌లో రైతుల ముసుగులో కొత్త శక్తులు ప్రవేశించారు. దుకాణాలను రూ.7 వేలు చెల్లించి స్వాధీనం చేసుకున్నారు. తరువాత బినామీల పేరుతో రూ.21 వేల వరకు వసూలు చేస్తున్నారని పలువురు కూరగాయాల విక్రయదారులు తెలిపారు.

ఒకరి దుకాణం.. మరొకరి వ్యాపారం..

రైతుల ముసుగులో కొందరు భారీ దోపిడీ చేస్తున్నారు. రూ.21 వేలు అద్దె చెల్లించలేక కొంత మంది దుకాణాలు వదిలి వెళ్లిపోతున్నారు. మార్కెట్‌లో కూరల ధరలు పెరగుతున్నాయి. కానీ అధికారులు నిర్దేశించిన ధరలకు విక్రయించలేక, అద్దెలు చెల్లించలేక, నిర్వహణభారంతో పలువురు నష్టపోతున్నారు. తాత్కాలిక పందిళ్లకు రూ.7 వేలు అద్దె అంటేనే ఎక్కువ అని అలాంటిది బినామీలు రంగ ప్రవేశం చేయడం మరింత ఇబ్బందిగా ఉందని సీనియర్ వ్యాపారులు వాపోతున్నారు. బృందావన్ గార్డెన్స్ రైతు బజార్‌లో మౌలిక సదుపాయాలపై ఎమ్మెల్యే గల్లా మాధవి పలుమార్లు డిఆర్‌సి సమావేశాల్లో ప్రస్తావించారు. మునిసిపల్ శాఖ కేటాయించిన స్థలంలో షెడ్లు నిర్మాణం కోసం మార్కెటింగ్ శాఖ రూ.2 కోట్లతో టెండర్లు పిలిచారు. రైతుబజార్‌కు వచ్చే రైతులు, వినియోగదారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు టెండర్లు పిలిచామని ఎవ్వరూ టెండర్లు వేయలేదని మార్కెటింగ్ శాఖ ఎడి తెలిపారు. అయితే మళ్లీ టెండర్లు పిలిచి వెంటనే పనులు ప్రారంభించాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించినా ఇంత వరకు స్పందనలేదు. ప్రధానంగా దుకాణాల అద్దె వసూలుపై మార్కెటింగ్ శాఖ అధికారులకు హేతుబద్ధత లేదని రైతులు, డ్వాక్రా సంఘాల నాయకులు, చిరు వ్యాపారులు వాపోతున్నారు. వాస్తవంగా రైతులకు కేటాయించినా దుకాణాలను రాజకీయ నాయకులకు కేటాయించి వారి ద్వారా బినామీలను ప్రవేశపెడుతున్నారనే విమర్శలున్నాయి.


సమ్మె శిబిరంలో కార్మికులు

షోకాజులకు భయపడేది లేదు

- కొనసాగుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె
- మేయర్ ప్రకటన అసత్యమని యూనియన్ ఖండన

ప్రజాశక్తి-గుంటూరు

సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులపై గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ బెదిరింపులకు పాల్పడుతున్నారని ది గుంటూరు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.ముత్యాలరావు అన్నారు. మంగళవారం మూడో రోజుకు చేరుకున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె ఉధృతంగా సాగుతోంది. తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ వద్ద సమ్మె శిబిరంలో ముత్యాలరావు మాట్లాడుతూ ఆరేళ్లుగా వేతనాలు పెంచకపోవటంతో కడుపు కాలి సమ్మె చేస్తున్న కార్మికులకు జిఎంసి కమిషనర్, అధికారులు షోకాజు నోటీసులు ఇస్తామంటూ బెదిరిస్తున్నారని విమర్శించారు. అధికారుల బెదిరింపులకు ఎవ్వరూ భయపడేది లేదన్నారు. సమస్యలపై స్పష్టమైన, రాతపూర్వక హామీ వచ్చే వరకూ సమ్మె కొనసాగుతుందని చెప్పారు. కార్మికుల శ్రేయస్సు కోరుకుంటే ప్రభుత్వానికి సమస్యలు సిఫార్సు చేయాలని ▶ 2లో

మేయర్ అసత్య ప్రకటన

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె విరమించినట్లు, విధులకు హాజరైనట్లు మేయర్ ప్రకటన చేయటాన్ని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఒక ప్రకటనలో ఖండించింది. సమ్మె శిబిరానికి వచ్చిన మేయర్ మాట్లాడుతూ సమస్య పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని అన్నారని, ప్రభుత్వం నిర్దిష్టమైన హామీ ఇచ్చేవరకు సమ్మె విరమించేది లేదని కార్మికులు నగర మేయర్‌కు తేల్చి చెప్పారని పేర్కొన్నారు. అసత్య ప్రకటనలతో కార్మికులను గందరగోళానికి గురిచేయటం సరికాదని, నగర ప్రథమ పౌరునికి ఇది తగనిదని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు పేర్కొన్నారు.

పత్తి పంటను దెబ్బతీసిన అధిక వర్షాలు

అప్పుల బాధ తాళలేక కౌలురైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - తాడికొండ



అప్పులు బాధ తాళలేక కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. తాడికొండ సిఐ కె.వాసు వివరాల ప్రకారం... మండలంలోని నిడుముక్కల గ్రామానికి చెందిన నెప్పల్లి సుబ్బారావు (60)కు ఎకరం పొలం ఉంది. దీనికితోడు మరో 20 ఎకరాలను కౌలుకు తీసుకుని రెండేళ్లుగా సాగు చేస్తున్నాడు. అధిక వర్షాల కారణంగా పత్తిపంట దెబ్బతినడంతో తీవ్ర అప్పులు పాలైన సుబ్బారావు సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందువ తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆయన్ను కుటుంబీకులు గమనించి ఆటోలో గుంటూరులోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అప్పటి నుండి చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

భూ సహజత్వం కోసం సేంద్రియం

- మోతాదుకు మించి ఎరువుల వినియోగాన్ని తగ్గించే కృషి
- రసాయన ఎరువుల వాడకంలో రాష్ట్రంలోనే రెండో స్థానంలో పల్నాడు జిల్లా - నిర్జీవమవుతున్న నేల

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా


పొలానికి తరలుతున్న పశువుల ఎరువు

గేదెల పేడ, గొర్రెల ఎరువు, కోళ్ల ఎరువు, కుళ్లిన మొక్కలు, పుట్టమట్టి ఇలాంటి సేంద్రియ ఎరువులే ఒకప్పుడు పంటల సాగులో ప్రధానంగా ఉండేవి. భూమిలో సేంద్రియ కర్బనం ఉత్పత్తి కూడా ఎక్కువగానే ఉండేది. కార్బన్-నత్రజని సమతుల్యతగా ఉండేది. జీవ సంబంధమైన వానపాము, సాలెపురుగు, ఆరుద్ర పురుగు, కందిరీగ, తూనిగ, సీతాకోకచిలుక, రైజోబీయం బ్యాక్టీరియ తదితర అనేక జీవులు భూమిలో భూసారాన్ని వృద్ధి చేయడంతో పాటు, మొక్కలపై జీవిస్తూ పంటలను చీడపీడలబారి నుంచి సంరక్షిస్తూ తోడ్పాటునందించేవి. కానీ పెరుగుతున్న జనాభా కనుగుణంగా ఆహార పంటల ఉత్పత్తి పెంచాల్సిన పరిస్థితుల మధ్య హైబ్రిడ్ విత్తన వంగడాలు అందుబాటులోకి వచ్చాయి. రసాయన ఎరువుల ప్రాధాన్యం పెరిగి సేంద్రియ ఎరువుల వాడకం పూర్తిగా తగ్గింది. మోతాదుకు ▶ 2లో


ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న అధికారులు

28.35 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్


ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఏలూరు జిల్లా సహాయ వ్యవసాయ సహాయకులు కోట రామచంద్రరావు, పిజి బుజ్జిబాబు, విజయవాడ రీజినల్ విజిలెన్స్ విభాగం ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ ఉమర్, మండల వ్యవసాయాధికారి బి.సుబ్బారెడ్డి తనిఖీలు చేయగా రైతులకు అమ్మిన సరుకు వివరాలు స్టాక్ రిజిస్టరులో నమోదు చేయకపోవటం, నిల్వల్లో వ్యత్యాసాలను గుర్తించారు. రూ.7.43 లక్షల విలువ గల 28.35 మెట్రిక్ టన్నులు ఎరువుల విక్రయాలను నిలిపేశారు.

హైకోర్టు లాయర్ కిడ్నాప్ యత్నం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి హైకోర్టు న్యాయవాది మేరిగ మోహన్‌రావు దంపతులను కిడ్నాప్ చేయడానికి ముగ్గురు దుండగులు యత్నించడం కలకలం రేపింది. బాధిత న్యాయవాది మోహన్‌రావు వివరాల ప్రకారం.. మోహన్‌రావు సోమవారం రాత్రి 7.30 గంటలప్పుడు ఇంట్లో ఉండగా గుర్తుతెలియని ముగ్గురు వచ్చి కేసు విషయమై మాట్లాడాలంటూ ఇంట్లోకి వచ్చారు. అనంతరం కత్తితో బెదిరిస్తూ మోహన్‌రావు, ఆయన భార్య జ్యోతి చేతులను తాళ్లతో కట్టి నోటికి టేపు ▶ 2లో


సిసి కెమెరాలో రికార్డయిన దృశ్యం

సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రిలో హెచ్ఐవి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

హెచ్ఐవి బారిన పడి, ఎఆర్‌టి మందులు వాడే ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకుని పరీక్షల్లో అసాధారణ స్థితి వున్నవారు సకాలంలో మందులు వాడటం ద్వారా ఎలాంటి ఇన్ఫెక్షన్లు సోకకుండా ఆరోగ్యంగా జీవించవచ్చని సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బోగా లక్ష్మణరావు తెలిపారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం లింక్ ఎఆర్‌టి ప్లస్ సెంటర్ నందు బిపి, షుగర్, సీరం క్రియాటిన్, హెపటైటిస్ బి, హెపటైటిస్ సి పరీక్షలు, రక్త శాతం, ఇతర వైద్య పరీక్షలు ఉచితంగా చేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. హాస్పిటల్ ఆర్ఎంఒ డాక్టర్ ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఇక్కడ ప్రతినెలా వైరల్ లోడ్ సీ డీ 4, క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతు ప్రతి రోజు ఎఆర్‌టి మందులు ఒకే సమయానికి క్రమం తప్పకుండా ప్రతి రోజూ వాడాలని చెప్పారు. ఏ ఆర్ టీ మందులు క్రమం తప్పకుండా వాడడం ద్వారా హెచ్ ఐ వి వైరస్ ను అదుపులో వుంచుకోవచ్చని, వైరల్ లోడ్ పరీక్షలో వైరస్ గుర్తించలేని స్థితిలో వుంటే



ఇతరులకు వ్యాపించదని క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సయ్యద్ జానీబాషా తెలిపారు. కౌన్సిలర్ రఘునాథ్, ల్యాబ్ టెక్నీషియన్ మహబూబ్ సుభాని, స్టాఫ్ నర్స్ అనూష, షేర్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ కె.రత్న కుమార్, సార్డ్ సంస్థ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఆదామ్ పాల్గొన్నారు.



రోటావేటర్‌తో పొలం కలియదున్నుతున్న రైతు

భూ సహజత్వం కోసం సేంద్రియం

(మొదటి పేజీ తరువాయి)

మించి రసాయన ఎరువుల వాడకం పెరిగింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా పల్నాడు జిల్లా రెండో స్థానంలో ఉంది. ఈ కారణంగా భూమిలో సేంద్రియ కర్బనం తగ్గి నేల నిర్జీవమవుతోంది. ఈ నేపథ్యంలో నేల సహజత్వాన్ని కోల్పోతే పంటలు పండడం ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు నెలకొంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు హెచ్చరిస్తున్నారు. వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల వాడకం పెంచి, పెట్టుబడి ఖర్చులు తగ్గించాలని సూచిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు రూపొందిచినా ఆశించిన మేర ఫలితాలు రావడం లేదు. పరిమిత సంఖ్యలోనే రైతులు సేంద్రియ వ్యవసాయానికి ఆసక్తిగా ఉంటున్నారు.

ఎరువుల వాడకం తగ్గించే కృషి

ఎం.జగ్గారావు, పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖాధికారి.



సేంద్రియ సాగు వైపు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. 50 శాతం రాయితీపై 4500 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశాం. పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువుల వినియోగంతో నేలలు సహజత్వాన్ని కలిగి ఉండి నేల ఉత్పాదకతకు కావాల్సిన అనుకూల లక్షణాలు పెరుగుతాయి. మొక్కకు పోషకాలు లభ్యమవుతాయి. పలురకాల ఎంజైములు, హర్మోన్లు, అమైనో అమ్లాలు తయారై మొక్క చురుకుగా పెరిగి నాణ్యమైన అధిక దిగుబడి వస్తుంది.

హైకోర్టు లాయర్ కిడ్నాప్ యత్నం

(మొదటి పేజీ తరువాయి)

అంటించారు. మోహనరావు చేతికి గాయమూ అయ్యింది. అనంతరం వారిని మోహన్‌రావు కారులోనే ఎక్కించారు. అయితే చాకచక్యంగా వ్యవహరించిన మోహన్‌రావు వారి నుండి తప్పించుకుని కారులో నుండి బయటపడ్డాడు. అనంతరం పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు గుమిగూడారు. దీంతో కిడ్నాపర్లు పరారయ్యారు. ఈ మొత్తం వ్యవహారం సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. ఆస్తి వివాదం నేపథ్యంలో తన చెల్లెలి కుమారుడి ప్రోద్భలంతో తనపై ఈ దాడి జరిగిందని మోహన్‌రావు చెబుఉన్నారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బందాలను రంగంలోకి దింపినట్టు సమాచారం.

షోకాజులకు భయపడేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

విజ్ఞప్తి చేశారు. బెదిరింపులు మానుకొని, సమస్యలు పరిష్కరించటం ద్వారా ప్రభుత్వం సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్ నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అతి తక్కువ వేతనాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించకపోవడంతో కుటుంబ సభ్యులను పస్తులు పెడుతూ, పిల్లల చదువులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో చిరు ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు అమలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సమ్మె శిబిరాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వై.యశ్వంత్ మాట్లాడుతూ కార్మికులకు ఎస్ఎఫ్ఐ అండగా ఉంటుందన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని పెదకూరపాడు తాళ్లూరులోని విత్తన, ఎరువులు, పురుగు మందులు దుకాణాలను అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. నిబంధనలు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదార్లను హెచ్చరించారు.

లంక భూముల్లో అవకతవకలపై చర్యలు తీసుకోండి

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన దొండపాడు ఎస్సీ కాలనీ వాసులు

ప్రజాశక్తి - తుళ్లూరు

లంక భూముల్లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని దొండపాడు ఎస్సి కాలనీ వాసులు మంగళవారం తహశీల్దార్ బి సుజాతకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ది దొండపాడు క్రిస్టియన్ బెనెంట్లు కో- ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో రాయపూడి రెవెన్యూలో దొండపాడు లంకలో 40 ఎకరాల లంక భూములున్నాయని చెప్పారు. సదరు భూమిని



మాట్లాడుతున్న దొండ పాడు గ్రామస్తులు

కౌలుకు ఇవ్వగా వచ్చిన సొమ్మును చర్చి పండుగలు ఇతరత్రా కార్యక్రమాలు నిర్వర్తిస్తూ వస్తున్నామని తెలిపారు. గత 15 ఏళ్లుగా కృష్ణానదికి వరదల తాకిడి కారణంగా భూమిని కౌలుకు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయినప్పటికీ చర్చి సంఘ పెద్దలు చందాలు వసూలు చేసి పండుగలు చేసుకోవడం జరుగుతోందని చెప్పారు. రాజధాని నేపధ్యంలో భూముల ధరలు పెరగడంతో కొంతమంది క్రిస్టియన్ ఆర్ సి ఎం చర్చి సభ్యులు స్వార్థ ప్రయోజనాల కోసం బయటి వ్యక్తులతో కలిసి పలు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమిని కబ్జా చేసే సంఘంలో ఉన్న కొంతమంది సభ్యుల పేర్లు తొలగించి తనకిష్టమైన వారి గోడు వారి పేర్లను రెవెన్యూ రికార్డులలో చేర్పించే ప్రయత్నం చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. అక్రమాలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు.



ట్రాక్టర్ల ద్వారా నీటి సరఫరా

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - దుర్గి : మండల కేంద్రమైన దుర్గిలో గత పది రోజుల నుండి 'నీటి కష్టాలు' అనే శీర్షిక ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు టిడిపి నాయకులు స్పందించారు. ట్రాక్టర్ల ద్వారా గత రెండు రోజుల నుండి తాగునీటిని సరఫరా చేశారు. టిడిపి సీనియర్ నాయకులు శెట్టిపల్లి నరసింహారావు తన పొలంలో ఉన్న బోరు ద్వారా నేలను ట్యాంకులకు నింపి నీటి ఎద్దడి గ్రామాలకు అందిస్తున్నారు. దుర్గి కస్తూరిబా గిరిజన బాలికల పాఠశాల, బుడుగు జంగాల కాలనీ, ఇందిరమ్మ కాలనీలలో నీటిని సొంత వాహనాల ద్వారా సరఫరా చేస్తున్నారు.

ఎమ్‌టిఎస్ ఉపాధ్యాయుల్ని బలి చేయొద్దు

ప్రజాశక్తి-గుంటూరు

ఇటీవల జరిగిన బదిలీల్లో దూర ప్రాంతాల్లో, ముఖ్యంగా పల్నాడు జిల్లాలో పనిచేస్తు బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానాల్లో పనిచేయటానికి ఎంటిఎస్ (మినిమం టైమ్ స్కేల్) ఉపాధ్యాయుల్ని నియమించాలని ప్రయత్నించటం సరికాదని ఎంటిఎస్ ఉపాధ్యాయులు వాపోయారు. తక్కువ జీతాలతో పనిచేస్తున్న



ఆర్‌జెడితో మాట్లాడుతున్న ఎంటిఎస్ ఉపాధ్యాయులు

తమను ఇష్టం వచ్చినట్లు, రోజుకో చోటకు మార్చొద్దని కోరారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులను రిలీవర్లుగా పంపిచటానికి డిఇఒ మంగళవారం వారిని కౌన్సెలింగ్‌కు పిలిచారు. ఈ సందర్భంగా ఎంటిఎస్ ఉపాధ్యాయులు ఆర్‌జెడి ఎదుట వారి గోడు వెళ్లబోసుకున్నారు. రెండు వారాల క్రితమే తమకు కౌన్సెలింగ్ నిర్వహించి, ప్లేస్‌లు కేటాయించారని, పది రోజులు కాకుండానే ఇప్పుడు మళ్లీ దూర ప్రాంతాలకు వెళ్లమంటున్నారని తెలిపారు. కావున గతంలో ఇచ్చిన స్థానాల్లోనే తమను కొనసాగించాలని కోరారు. అయితే ఆర్‌జెడి, డిఇఒ వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.



ఎస్సీ హాస్టల్‌లో అధికారుల తనిఖీ

ప్రజాశక్తి - మాచర్ల : పట్టణంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో మంగళవారం విద్యార్థుల మధ్య ఘర్షణ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు హాస్టల్‌ను తహశీల్దారు కిరణ్‌కుమార్, పట్టణ ఎస్ఐ వెంకటరమణ, ఎఎస్‌డబ్ల్యూఓ సుజాత కుమారి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడిన అనంతరం విద్యార్థులకు, హాస్టల్ వార్డెన్ నూరుల్లా బేగ్, వాచ్మెన్, ఇతర సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అవార్డు గ్రహీతకు ఎమ్మెల్యే సత్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి : జాతీయ చేనేత అవార్డు పురస్కార గ్రహీత కర్నాటి మురళిని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం సన్మానించారు. సత్తెనపల్లి పట్టణం 31వ వార్డు నందు జాతీయ చేనేత అవార్డుకు ఎంపికైన కర్నాటి మురళి ఇంటికెళ్లిన ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు.



బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి



బాల్య వివాహాలు చేయడం ద్వారా బాలికల్లో అనేక రకాల అనారోగ్య సమస్యలు తలెత్తి జీవితం అధోగతి పాలవుతుందని ఐసిడిఎస్ పీడీ ఉమాదేవి అన్నారు. బాల్య వివాహాలతో అనర్థాలపై జిల్లా బాలల పరిరక్షణ ఆధ్వర్యంలో బాలల చట్టాలపై పట్టణంలోని టిటిడి కళ్యాణ మండపంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పీడీ ఉమాదేవి మాట్లాడుతూ అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండే వరకు ఎట్టి పరిస్థితుల్లో వివాహం చేయరాదన్నారు. చిన్న వయసులో వివాహాలు చేయడం ద్వారా గర్భస్రావం, బరువు తక్కువ పిల్లలు పుట్టడం, కాన్పులు కష్ట మవటం, రక్తహీనత కొన్ని సందర్భాలలో మాత శిశు మరణాలు సంభవిస్తాయన్నారు. అవగాహన లోపం, ఆరోగ్య సమస్యలతో పాటు మానసిక సమస్యలు అధికంగా ఉంటాయన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలల కోసం రూపొందించిన చట్టాలను వివరించారు. గ్రామాలలో ఉన్న కమిటీ బాల్య వివాహాల మానిటరింగ్ సమావేశాలు ప్రతి నెల 1వ శుక్రవారం, 3వ శుక్రవారం నిర్వహించాలని తెలిపారు. ఎవరైనా బాల్య బాలల చట్టాలను అతిక్రమిస్తే చట్టపరంగా శిక్షారులన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ శ్రీలత, ఎసిడిపిఒ శాంతకుమారి, డిసిపిఒ శౌరిరాజు పాల్గొన్నారు.

ఘనంగా మదార్ సాహెబ్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - మాచర్ల : తెలుగు యువత మాజీ అధ్యక్షులు షేక్ మోసిన్ ఆధ్వర్యంలో మాచర్ల మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ పుట్టిన వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. పలు కూడళ్లలో కేక్ కట్ చేశారు. సయ్యద్ హుస్సేన్ ఉపాధి కొరకు చైర్మన్ మదార్ తోపుడు బండిని అందించారు. టిడిపి సీనియర్ నాయకులు ఎనుముల కేశవరెడ్డి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - తెనాలి : బైకు అదుపుతప్పి ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటనలో వ్యక్తి గాయపడ్డాడు. మార్కెట్ వంతెన సమీపంలోని ఆలపాటి వారధి వద్ద ఆర్టీసీ బస్సు మార్కెట్ వైపు నుండి బస్టాండ్ కి వెళుతుండగా, కుచ్చెళ్ళపాడుకు చెందిన పి నాగరాజు బైక్ పై ప్రయాణిస్తూ టర్నింగ్ తిప్పుపోయి అదుపుతప్పి బస్సు వెనుక చక్రం కిందికి జారాడు. ప్రమాదంలో అతని కాలు చితికి పోయింది. గమనించిన స్థానికులు అంబులెన్స్ లో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలిం చారు. కాగా అతనికి ప్రాణాపాయం లేదని వైద్యులు వెల్లడించారు.

మహిళలు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోండి

జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని మహిళా జెడ్పిటిసిలు, ఎంపిటిసిలు, ఎంపిపిలకు జిల్లా పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల శిక్షణా శిబిరాన్ని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మంగళవారం ప్రారంభించారు. మహిళా నాయకత్వంలో మార్పు, స్థానిక స్వపరిపాలనలో సాధికారత అనే అంశం మీద 3 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మహిళా నాయకత్వంలో మార్పు ద్వారా స్థానిక పాలనలో సుపరిపాలన సాధ్యం అని అన్నారు, మహిళా ప్రజా ప్రతినిధులు అందరూ తమ నాయకత్వ లక్షణాలను మెరుగు



పరుచుకోవాలన్నారు. రాబోయే కాలంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు అమలు అయితే రాజకీయంగా మహిళలు ఎన్నో అవకాశాలు వస్తాయన్నారు. జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ

ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

స్థానిక సోషన్ వేల్ఫేర్ హస్టల్‌లో విద్యార్థుల మధ్య జరిగిన స్వల్ప వివాదంలో మాటలు పెరిగి ఘర్షణ జరిగింది. ఘర్షణలో ఒక విద్యార్థి కర్రతో దాడి చేయగా మరోక విద్యార్థికి తలపై తీవ్రగాయం అయినది. సోషల్ వేల్ఫేర్ హస్టల్‌లో మాచర్ల పట్టణంలోని వివిధ కాలేజిల్లో చదువుకునే విద్యార్థులు 40 మంది వరకు ఉన్నారు. మంగళవారం ఉదయం విద్యార్థుల మధ్య వివాదం తలెత్తింది. వివాదంలో మాట, మాట పెరిగి ఐటిఐ కాలేజిలో చదివే విద్యార్థులు మాచర్ల కళ్యాణ్, శ్యామ్ ప్రసన్నకుమార్‌లు మంగపురం తండాకు చెందిన బాణావత్ సైదానాయక్‌పై కర్రతో దాడి చేసి గాయపర్చారు. సైదానాయక్‌ను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. హస్టల్ ఇన్‌చార్జీ వార్డెన్ బేగ్ మాట్లాడుతూ విద్యార్థుల మధ్య చిన్న విషయంపై మాటలు పెరిగి ఘర్షణ జరిగింది. పోలీసులకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పదవి బాధ్యతలు స్వీకరించిన యార్డు పాలకవర్గం

ప్రజాశక్తి దుగ్గిరాల

దుగ్గిరాల వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో పదవులు పొందడం గర్వకారణమని, అవినీతికి ఆస్కారం లేకుండా రైతులకు సేవ చేయాలని గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పోతినేని శ్రీనివాస్ కోరారు క్రొత్తగా ఏర్పడిన పాలకవర్గ కమిటీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు యార్డ్ సెక్రటరీ జెవి సుబ్బారావు పాలకవర్గం చేత ప్రమాణం చేయించారు వైస్ చైర్మన్గా శిరసాని రవికిషోర్ 12 మంది రైతులు ముగ్గురు వ్యాపారస్తులు నలుగురు ఎక్స్ అఫీషియల్ తో మొత్తం 19 మంది పాలకు వర్గ కమిటీ ఏర్పడింది ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంటూ యార్డులో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. శుభం మహేశ్వరి ఓల్డ్ స్టోరేజ్లో జరిగిన అగ్ని ప్రమాదంలో పంట నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని త్వరలో నష్టపరిహారం అందేటట్లు చూస్తామన్నారు. టిడిపి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో ముందు వరుసలో ఉంటుందని త్వరలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తారన్నారు మంగళగిరి ఎమ్మెల్యే మరియు మంత్రి నారా లోకేష్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మోడల్ నియోజకవర్గంగా నిలబెడతారని తెలిపారు. కార్యక్రమంలో మంగళగిరి మార్కెటింగ్ యార్డ్ చైర్మన్ జవాది కిరణ్ చంద్, మాజీ చైర్మన్ పాటి బండ్ల కృష్ణ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షులు కేశంనేని అనిత ఎంపీపీ షేక్ జబీన్ టిడిపి వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి గూడూరు వెంకటరావు మాజీ ఎంపీపీ వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్ పార్టీ నాయకులు వాసిరెడ్డి శ్రీనివాసరావు ఏళ్ల జయలక్ష్మి తాడిబోయిన అశోక్ దేవరపల్లి చంటి జనసేన పార్టీ మండల అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు వైస్ ఎంపీపీ పసుపులేటి సాయి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి తాళం పగలగొట్టి చోరీ

ప్రజాశక్తి- తాడేపల్లి

ఇంటి తాళం పగలగొట్టి దొంగలు ఇంట్లో దోరబడి నగదు, బంగారం తీసుకెళ్లిన ఘటన తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్ నగర్ లో జరిగింది. దీనికి సంబంధించి తాడేపల్లి పోలీసులు తెలిపిన కథనం ప్రకారం ప్రకాష్ నగర్ లో నివాసం ఉంటున్న బొందలపాటి యోగేశ్వరరావు ఈనెల 9వ తేదీన నాగపట్నం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగల గొట్టబడి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి అందులో ఉన్న రూ 5000 నగదు, ఐదు ఐదు గ్రాములు బంగారపు ఉంగరం, చెవి దిద్దులు మూడు గ్రాములు, జుంకీలు మూడు గ్రాములు, బేబీ ఉంగరం దొంగలు ఎత్తుకెళ్లినట్టు గుర్తించాడు. బాధితుడు తాడేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్చార్జి చందు సాంబశివుడు మంగళవారం ఎపిసిపిడిసిఎల్ డివిజన్ కార్యాలయం ఈఈ వివి చిరంజీవి కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కాల్వలు ద్వారా నీరు వదలకముందే రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో ఏర్పాటు చేసుకున్న బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. వెదసాగులో నాట్లు వేసిన పంటలకు నీటి అవసరత చాలా ముఖ్యమని, పంట కాల్వలు ద్వారా అందాల్సిన సాగునీరు సకాలంలో రాకపోయినా, వర్షాలు లేకపోయినా పంట సాగుబడికి బోర్లు అండగా నిలుస్తాయని తెలిపారు. డివిజన్ పరిధిలోని వేమూరు, దుగ్గిరాల, కొల్లిపర తదితర ప్రాంతాల వ్యవసాయ క్షేత్రాల్లో స్తంబాలను ఏర్పాటు చేసి వీలైనంత ఎక్కువ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా విద్యుత్ కనెక్షన్ల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులను కోరారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : తెనాలి మండలంలోని నందివెలుగు ఎరువులు దుకాణాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నందివెలుగు సాయికామక్షి ట్రేడర్స్ దుకాణంలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులతో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. అనుమతిలేని, నిబంధనకు విరుద్ధంగా ఉన్న డిఎపి 145 రకం ఎరువుల బస్తాలతో పాటు రూ 1.96 లక్షలు విలువైన ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే వెంటనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. తనిఖీలో గన్నవరం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. సునీల్, ఇన్స్పెక్టర్ ఆఫ్ విజిలెన్స్ సిహెచ్ రవిబాబు, తెనాలి, గుంటూరు మండల వ్యవసాయ అధికారి కె సుధీర్ బాబు, బి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

GENERAL NOTICE
IN THE COURT OF THE VI ADDL. DISTRICT JUDGE, BAPATLA.
GW.O.P.No.542/2025
(IN THE MATTER OF APPOINTMENT OF THE GUARDIAN FOR THE PERSON OF MINOR GIRL KOMMALAPATI DARSHINI, DATE OF BIRTH 26.9.2007, DAUGHTER OF KOMMALAPATI AMARENDRA AND KOMMALAPATI SUJATHA OF APPAPURAM VILLAGE, KAKUMANU MANDAL, GUNTUR DISTRICT.)

Between:-
Kommalapati Sujatha ...... Petitioner.
and
Nil. .....Respondent.

The above numbered O.P. was filed by the Petitioner to appoint the Petitioner as guardian to her minor child by name Kommalapati Darshini and permit the Petitioner to sell away the plaint schedule property to the extent of Minor's share along with her share before the above Hon'ble Court. The Hon'ble Court ordered to publish the General Notice in News Paper i.e. Praja Sakthi, District Edition, Guntur that if any person have any objection with regard to the above O.P. they may attend before the Hon'ble Court in person or through an Advocate on 04.8.2025 at 10.30 AM. Otherwise, the Petition will be decide against you indirectly.

SCHEDULE
Guntur District, Narasaraopet Reg. District, Kakumanu Sub-District, Appapuram Gram pancnayat Area, Appapuram Village in D.No.86/9A, 86/9B an extent of Ac 0.78 cents of wet land (Poora land).
Adjournment Date : 04.8.2025.
With the orders of the Hon'ble Court.
Bonigala Ankamma Rao,
Chillara Naga Raju,
Advocate for Petitioner,
PONNUR, Cell: 9866673301.

వేలం ప్రకటన
మహారాజశ్రీ గురజాల సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఇ.పి.నెం.20/2022 ఇన్ ఒ.యస్.నెం.122/2018
బిట్వీన్:
బత్తుల కోటయ్య(డైడ్) వగైరాలు ...డి.హెచ్.ఆర్స్
మరియు
వీర రాములు ...జె.డి.ఆర్.

పై నెంబరు ఇ.పి.లో యిస్తిహారు జారీ కాబడి జప్తు ఖాయమైన జె.డి.ఆర్. తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి యెదుట **ది.05-08-2025న ఉ.గం.10-30ని.**లు లగాయతు వేలం వేయబడును. కావలసినవారు వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును. ఇతర వివరాలకు శ్రీ కోర్టు నాజరు గారి వద్ద గాని,డి.హెచ్.ఆర్. న్యాయవాది గారి వద్ద గాని తెలుసుకొనవచ్చును.

Schedule: Guntur Dt., Narasaraopet Dt. Registration, Gurazala Sub-Registrar's office limits, Gurazala Village Panchayati limits and Gurazala(V) an extent of 0-20 cents in D.No:750/A-1, an extent of Ac:0-07 cents in D.No.:778/1A, an extent of Ac: 0-21 cents in D.no.778/1B1, an extent of Ac:0-24 cents in D.No.779/1, an extent of Ac: 0-04 cents in D.No.1819/1-2, an extent of Ac: 0-51 cents in D.No.1819/1-2 in total extent of Ac: 1-27 cents out of which 0-03 cents i.e 136.66 Square Yards a R.C.C Building consisting the following boundaries,**East:**House of Vangudothu Sathyavathi,**South:**Road,West:House of Kakarla Lakshmi Narasamma,**North:**Vacant site of Peddineni Venkatanarayana.
D.Hr. ValueRs.4,50,000/-
Ameen ValueRs.8,00,000/-
Sale Date:05-08-2025
Further Hearing:12-08-2025

జక్కా చెన్నకేశవరావు, డి.హెచ్.ఆర్స్ తరపు అడ్వకేట్, గురజాల, పల్నాడుజిల్లా, సెల్: 9885134858

SALE NOTICE
IN THE COURT OF THE HON□BLE PRL CIVIL JUDGE (JUNIOR DIVISION) : TENALI
E.P.No.217 OF 2023
In
O.S.No. 424 OF 2023

BETWEEN:
Karnata Venkatrao ....DHR
AND
Nerella Prameela Rani .... JDR

SCHEDULE
Guntur District, Duggirala Sub District, Duggirala Panchayat, 9th Block, bounded by: East Circar Road f 25-0□, South: Kanayaka Parameswari Vysyula Sathram f 151-3□;, West: Jampala Seshagiriramma□s site f 14-6□, North: Khambampati Nageswara Rao□s & Shaik Husain site f 38-3□;, within the boundaries an extent of Sq 187.1/5 yards, within 105 years back old tiled house therein constructed (sq 787 ft) old Door No. 9-9, new no.9-8.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
అమీనా విలువ : 14,46,400/-
మార్కెట్ విలువ : 14,46,850/-
డిహెచ్ఎర్ విలువ: 9,00,000/-
Sale date: 01-08-2025
ఫరదర్ హియరింగ్ : 06-8-2025
K.VENKATESWARA RAO,
ADVOCATE, TENALI.

మహారాజశ్రీ పొన్నూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
ఓ.యస్.నెం.155/2024.

విస్సంశెట్టి శివరామ కోటేశ్వరరావు. ... వాది
ఎదిరి
గడ్డం కోటేశ్వరరావు ... ప్రతివాది.
టు
గడ్డం కోటేశ్వరరావు, S/o. లేటు రాఘవయ్య,
హిందువు, వయస్సు 70 సం॥ లు,
వ్యవసాయం, సాకిన్ : కొల్లిమర్ల గ్రామము,
కాకుమాను మండలం, గుంటూరు జిల్లా.

పై నంబరుగల దావాలో వాది, ప్రతివాదిపై ప్రామిసరీనోటు బాకీ రాబట్టుకొను నిమిత్తం దావా దాఖలు చేయగా సదరు దావాలో ప్రతివాదికి సమన్లు నిమిత్తం ఎన్నిసార్లు నోటీసులు పంపించినను సదరు ప్రతివాది సమన్లు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున సబ్స్టిట్యూట్ సర్వీసు ద్వారా అనగా పేపరు పబ్లికేషను ద్వారా ప్రతివాదికి సమన్లు జారీచేయుటకు శ్రీకోర్టువారు ది.01.8.2025 తేదీకి వాయిదావేసి యున్నారు. కాన ప్రతివాది ఆరోజు పగలు 10.30 గం॥ లకు పైకోర్టువారి ఎదుట స్వయముగా గాని, లేదా వకీలు ద్వారాగాని హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేనిచో శ్రీ కోర్టువారు విచారించి మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదా తేది : 01.8.2025.
పొన్నూరు,
తేది.14-07-2025. **ఇట్లు**
చిల్లర నాగరాజు,
వాదితరపు న్యాయవాది,
పొన్నూరు - 522 124, గుంటూరు జిల్లా,
సెల్ : 9948503747.

IN THE COURT OF THE PRL. (JUNIOR CIVIL JUDGE) (JUNIOR DIVISON) AT NARASARAOPET
E.P. No. 98/2024 Dis No. 288/2022

Between
M/s Lakshmi Tulasi Chit Fund Pvt. Ltd., Narasaraopet Branch rep. by Foreman/ Branch Manager .... DHR
And
Galla Mohan Babu & Others .... JDR□s
JDR3 Address :
Annaladasu Subba Rao, S/o Jesu Rathnam, Occ : S.G.T., O/o MPPS School, Narasanayuni palem, Vinukonda (Md), Palnadu (Dist).

పై నెంబరు ఇ.పి. నందు నేను డిహెచ్ఆర్ అయ్యివున్నాను. పై నెంబరు ఇ.పి. నందు జెడిఆర్ 3 అయిన మీకు ఎన్నిసార్లు కోర్టు ద్వారా నోటీసులు జారీ చేసినచో తీసుకోని కారణంచేత శ్రీయుత కోర్టువారు ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా మీకు తెలియపరచటమైనది. ది. 11-8-2025వ తేదీన వాయిదా అయివున్నది. కావున మీరు గానీ, మీ తరపు వకీలు ద్వారా గానీ శ్రీయుత కోర్టువారి ఎదుట హాజరయి మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనిచో మీకు పరోక్షంగా తీర్మానించబడునని తెలియపరచటమైనది.
(శ్రీయుత కోర్టువారు ఉత్తర్వులతో)
వాయిదాతేది: 11-8-2025
పి.చక్రపాణి, బి.కాం., ఎల్ఎల్.బి.,
అడ్వకేట్,
కెబిఆర్ కాంప్లెక్స్, షాప్ నెం. 64,
స్టేషన్‌రోడ్డు, నరసరావుపేట.
సెల్ : 9885644283

పిడుగురాళ్ళ జూనియర్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు : పిడుగురాళ్ళ
ఓ.యస్.నెం. 226/2021

బిట్వీన్ :
ఏలూరి ఆనందకుమార్ ... ప్లెయింటిఫ్
మరియు
ఆరేటి సర్వేశ్వరరావు .... రెస్పాండెంట్

మా క్లయింట్ పైన నెంబర్ ఓ.యస్.నెం. 226/2021లో మీరు రెస్పాండెంట్ అయినందున మా క్లయింట్ కోర్టు ద్వారా మీకు అనేక మందులు నోటీసులు పంపించియున్నారు. కాని మీరు కావాలనే కోర్టు నుండి వచ్చిన నోటీసులను తీసుకోవటం లేదు. కనుక కోర్టువారు ప్రత్యామ్నాయ సర్వీసు క్రింద పేపరు పబ్లికేషన్‌కి ఇవ్వమని మీరు నోటీసు తీసుకొని వెంటనే మీరు కాని మీ తరఫు లాయరు కాని అటెండు అయి ది. 16-7-2025 మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనియెడల మీ పరోక్షమున వాయిదారోజు తీర్మానించ గలరు. శ్రీ పిడుగురాళ్ళ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టువారు
తేది : 14-7-2025
పిడుగురాళ్ళ. **ఇట్లు**
ప్లెయింటిఫ్ అడ్వకేట్,
పి.మాణిక్యం,
అడ్వకేట్, పిడుగురాళ్ళ.
సెల్ : 81069 29035

ఆర్డర్ 21 రూల్ 22 నోటీసు
మహారాజశ్రీ గురజాల సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఇ.పి.నెం. 50/2024 ఇన్ ఒ.యస్.నెం.46/2014

బిట్వీన్:
పెనుగొండ గురవయ్య ...డి.హెచ్.ఆర్
మరియు
చలంచర్ల వెంకటేశ్వర్లు (డైడ్) వగైరాలు... జె.డి.ఆర్స్
టు,
జె.డి.ఆర్ నెం-5: వాక శ్రీ లత, భర్త.నరసింహారావు, కిరాణా షాపు, నివాసం. క్రోసూరు రోడ్డు, అమరావతి (గ్రామం & మం), పల్నాడు జిల్లా.

పై నెంబరు ఇ.పి.లో 5వ జె.డి.ఆర్. అయిన మీకు ఆర్డర్ 21 రూలు22 నోటీసులు పై కోర్టు వారి నుండి పంపించిన మీకు ముట్టనందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.29-07-2025కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
వాయిదా తేది:29-07-2025
జక్కా చెన్నకేశవరావు,
డి.హెచ్.ఆర్.తరపు అడ్వకేట్,
గురజాల, పల్నాడు జిల్లా.
సెల్: 98851 34858.

ఆర్డర్ 21 రూల్ 22 నోటీసు
మహారాజశ్రీ గురజాల సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఇ.పి.నెం.51/2024 ఇన్ ఒ.యస్.నెం.47/2014

బిట్వీన్:
పెనుగొండ గురవయ్య ....డి.హెచ్.ఆర్
మరియు
చలంచర్ల వెంకటేశ్వర్లు (డైడ్) వగైరాలు ...జె.డి.ఆర్స్
టు,
జె.డి.ఆర్ నెం-5: వాక శ్రీ లత, భర్త.నరసింహారావు, కిరాణా షాపు, నివాసం. క్రోసూరు రోడ్డు, అమరావతి (గ్రామం & మం), పల్నాడు జిల్లా.

పై నెంబరు ఇ.పి.లో 5వ జె.డి.ఆర్. అయిన మీకు ఆర్డర్ 21 రూలు22 నోటీసులు పై కోర్టు వారి నుండి పంపించిన మీకు ముట్టనందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.29-07-2025కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
వాయిదా తేది:29-07-2025
జక్కా చెన్నకేశవ రావు,
డి.హెచ్.ఆర్.తరపు అడ్వకేట్,
గురజాల, పల్నాడు జిల్లా.
సెల్: 98851 34858.



ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు

ప్రజాశక్తి - నకరికల్లు

స్థానిక జగనన్న కాలనీ లే అవుట్-2లో స్థలాలను కబ్జాచేయడానికి కొదరు యత్నించిన నేపథ్యంలో ఆ స్థలాలను తహశీల్దార్ పుల్లారావు మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ ఖాళీ భూములను ఎవరైనా ఆక్రమించుకోవాలని చూస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆ భూముల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. లే అవుట్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో నివాసం లేని గుడిసె ఏర్పాటును పరిశీలించి తొలగింపునకు ఆదేశాలిచ్చారు. పరిశీలనలో ఆర్ఐ టి.సిద్దయ్య, విఆర్వో పి.శారదకు, సర్వేయర్లు రామిరెడ్డి, విజయ్ పాల్గొన్నారు.



భూముల వివాదంపై మళ్లీ సమావేశం

ప్రజాశక్తి - అచ్చంపేట

పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పాడుగింజుపల్లి, చెరుకుపాలెం, చల్లగిరిగ, కొండూరు, అటవీ ప్రాంతాల భూ విషయమై బాధిత రైతులు, రెవెన్యూ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆటవీశాఖ, రెవెన్యూ శాఖల నుండి తామెదుర్కొంటున్న ఇబ్బందులను రైతులు వివరించారు. చెరుకుంపాలెం గ్రామం తాళ్లచెరువు రెవెన్యూలోని 320, 321, 322 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిని 1993లో పేదలకు ప్రభుత్వం కేటాయించిందని, అయితే అవి అటవీ భూములంటూ గతేడాది నుండి ఆ శాఖ సిబ్బంది తమను సాగు చేసుకోకుండా అడ్డుకుంటున్నారని రైతులు చెప్పారు. దీనిపై పలువురు అధికారులకు విన్నవించినా సరైన చర్యల్లేవని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కె.గోపికృష్ణారెడ్డి, రైతుసంఘం నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు, బాధిత రైతులు వివరించారు.

స్మార్ట్ మీటర్‌తో ప్రమాదాలపై ప్రచారం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని ప్రజలు అడ్డుకోవాలని సిపిఎం పిలుపునిచ్చింది. ఈ మేరకు పట్టణంలోని గాంధీనగర్లో సిపిఎం శ్రేణులు మంగళవారం ప్రచారం చేశారు. రూ.17 వేల వరకు ఉండే స్మార్ట్ మీటర్ ఖరీదును ప్రజలపైనే వేస్తారని, బిల్లులు సైతం అధికంగా వస్తాయని చెప్పారు. సమయాన్ని బట్టి విద్యుత్ రేట్లు ఉంటాయని, ముందస్తుగా డబ్బులు చెల్లించకుంటే సరఫరా ఉండదని వివరించారు. ప్రజలు ఎక్కువగా వాడుకునే ఉదయం 6 నుంచి 10 గంటలు, సాయంత్రం 6 నుంచి 10 గంటలు మధ్య అధిక ధరలు వసూలు చేస్తారన్నారు. వీటికి వ్యతిరేకంగా జనం కదలాలని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి టి.శ్రీనివాసరావు, నాయకులు బి.వెంకటేశ్వర్లు, డి.వెంకటేశ్వర్లు, కె.శేషు దానం పాల్గొన్నారు.



సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మె

- మూడో రోజుకు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ఆందోళన - వైసిపి, పలు సంఘాల మద్దతు
- నరసరావుపేటలో ఎమ్మెల్యేకు వినతి, పిడుగురాళ్లలో వంటావార్పు, సత్తెనపల్లిలో అర్ధనగ్న ప్రదర్శన



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు, నాయకులు



సత్తెనపల్లిలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - నరసరావుపేట

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ చేపట్టిన సమ్మె మంగళవారం మూడో రోజుకు చేరింది. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో సమ్మె శిబిరాన్ని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్ సందర్శించి సంఘీభావంగా మాట్లాడారు. ప్రభుత్వం దిగివచ్చేంత వరకూ ఉద్యమించాలని, తామూ అండగా ఉంటామని చెప్పారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులంతా ఎమ్మెల్యే అరవిందబాబును కలిసి వినతి పత్రం అందచేశారు. పిడిఎం నాయకులు ఎన్.రామారావు, బిసి సంఘం నాయకులు బి.శ్రీను, సంగమేశ్వరరావు, సల్మాన్, వీరకుమార్, జీవరత్నం మద్దతుగా పాల్గొన్నారు.



పిడుగురాళ్ల సమ్మె శిబిరం వద్ద వంటావార్పులో కార్మికులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

కార్మికులు పట్టణంలో సమ్మె శిబిరము వద్ద వంటావార్పు చేశారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడ్రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం రాలేదన్నారు. పైగా నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని, షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారని విమర్శించారు. ఇదిలా ఉండగా సమ్మె శిబిరాన్ని వైసిపి వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు, పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు చింతలపూడి అశోక్ బాబు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు అండగా ఉంటామన్నారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వర్లు మద్దతు తెలిపారు. కార్మికులు వెంకయ్య, సారథి, మధుబాబు, వి.శ్రీనివాస రావు, జి.పవన్ కుమార్, నాగుర్, హుస్సేన్, జి.విజయ్ కుమార్, సాగర్, శ్రీనాథ్, ఎ.శ్రీనివాసరావు, రమేష్, సురేష్, సుభాని, కె.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రత్నబాబు, కె.తిరుపతిరావు, బాలస్వామి, వి.ప్రతాప్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. సిఐటియు పట్టణ కన్వీనర్ జె.రాజ్‌కుమార్ మాట్లాడారు. కనీస వేతనం, ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. తొలుత పట్టణంలో ర్యాలీ చేశారు. కిరణ్, కుమార్ స్వామి, జానీ థామస్, బి.ఏలియా పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు - రూ.లక్షకుపైగా సరుకు సీజ్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : పట్టణంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు దుకాణాలను విజిలెన్స్, వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనరేట్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. మెగా సీడ్స్ విత్తన షాపు, ఆర్‌పికెఎన్ అండ్ సన్స్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. మెగా సీడ్స్ విత్తన షాపులో సరైన పత్రాలు లేని కారణంగా రూ.1,11,781 విలువగల ఎరువుల విక్రయాలను నిలిపేశారు. మండల కేంద్రమైన నకరికల్లులోని దుకాణంలోనూ తనిఖీలు చేపట్టారు. ఎడిఎ కె.కన్నయ్య, విజిలెన్స్ సిఐ ఎన్.అపర్ణ అచ్చంపేట, పిడుగురాళ్ల, నకరికల్లు వ్యవసాయాధికారులు పి.వెంకటేశ్వర్లు, ఎం.సంధ్యారాణి, దేవదాసు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న జి.మల్లీశ్వరి

అంగన్వాడీ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-సత్తెనపల్లి

గత ఎన్నికల ముందు అంగన్వాడీల 42 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీల ప్రకారం వేతనాలు పెంచాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు జి.మల్లేశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి ప్రాజెక్టు మహాసభలో ఎస్‌కె సుజాత అధ్యక్షతన నిర్వహించగా మల్లీశ్వరి మాట్లాడారు. గత సమ్మె సందర్భంగా కూటమి నాయకులు సమ్మె శిబిరాల వద్దకు వచ్చి హామీలిచ్చినా అధికారంలోకి వచ్చాక విస్మరించారని అన్నారు. పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాప్‌లతో పని భారం పెంచాయని అన్నారు. అంగన్వాడీలకు తల్లికి వందన పథకాన్నీ వర్తింపజేయకపోవడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందంలోని టీఏ బిల్లులు నెలకు ఒకటి ఇస్తామని ఇంతవరకు అమలు చేయడం లేదన్నారు. మినీ వర్కర్స్‌ని మెయిన్ వర్కర్‌గా గుర్తించాలన్నారు. ఈ సమస్యలపై అంగన్వాడీలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సిఐటియు పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు గుంటూరు విజయకుమార్ సౌహార్ధ సందేశమిచ్చారు. ఈ సందర్భంగా 13 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్‌కె సుజాత, ఎస్.అహల్యాలు, గౌరవాధ్యక్షులుగా పి.మహేష్, ఉపాధ్యక్షులుగా జ్యోతి, సహాయ కార్యదర్శిగా భవాని, ట్రెజరర్‌గా అంజలీ ఎన్నికయ్యారు.



విచారణలో భాగంగా వివరాలు సేకరిస్తున్న ఆర్‌డిఒ మధులత, డిఇఒ చంద్రకళ

యడ్లపాడు పాఠశాల వివాదంపై విచారణ

ప్రజాశక్తి - యడ్లపాడు

స్థానిక లూథరన్ పాఠశాల భూమి అన్యాక్రాంతమవుతుందనే ఎఇఎల్‌సి సంస్థ ఫిర్యాదుపై ఆర్‌డిఒ మధులత మంగళవారం విచారణ చేపట్టారు. యడ్లపాడులోని పాఠశాలకు వచ్చి పరిశీలించి అన్యాక్రాంతమేమీ కాలేదన్నారు. అనంతరం పాఠశాల నిర్వాహక కమిటీ, పాఠశాల అభివృద్ధి కమిటీతో పాఠశాలలోనే సమావేశమయ్యారు. పలు అంశాలను పాఠశాల అభివృద్ధి కమిటీ వివరించింది. 1952లో గ్రామానికి చెందిన పోవూరి వెంకటసుబ్బారావు 333వ సర్వే నంబరులో 0.88 సెంట్లు పాఠశాలకు ఇవ్వగా గ్రామ కమిటీ తీర్మానం చేసి పాఠశాల భవనాలను నిర్మించిందని, తదుపరి గుంటూరుకు చెందిన ఎఇఎల్‌సి సంస్థకు నిర్వహణ బాధ్యతలు మాత్రమే ఇచ్చిందని చెప్పారు. కాలక్రమేణా నిర్వహణలో వారి అశ్రద్ధ, ఉపాధ్యాయులు లేకపోవడం, భవనాలు దెబ్బతినడం వంటివి జరిగాయని ఇప్పుడు పాఠశాలలో విద్యుర్థులే లేరని చెప్పారు. దీంతో పాఠశాల అభివృద్ధి కమిటీ భవనంపై కప్పులు, ప్రహరీ నిర్మాణం చేపట్టిందని చెప్పారు. పాఠశాల నిర్వహణకు నూతలపాటి వంశీకులు ప్రకాశం జిల్లాలో 12 ఎకరాలను ఇచ్చినా ఎఇఎల్‌సి దాన్ని సరిగా నిర్వహించని కారణంగా ఆక్రమణకు గురైందని, పాఠశాల కమిటీ జోక్యం చేసుకొని తిరిగి దక్కించుకుందని తెలిపారు. ఎఇఎల్‌సి సంస్థ వివాదాల కారణంగా సుప్రీం కోర్టుకు వెళ్లగా కేసు పరిష్కారం అయ్యేదాక నూతన కమిటీ నియమించాలని చెప్పిందని తెలిపారు. సంస్థ సెక్రటరీ ఫార్నర్ విశ్రాంత జడ్జి ఎన్.ఏసురత్న కుమార్ వివరిస్తూ వేరళ ఆడ్మిన్ స్టేషన్ జడ్జి కొరియన్ జోసఫ్ అధ్యక్షతన కమిటీ ఏప్రిల్ 25న నియమించిందని, వారి ఆదేశాలను సారంగా సంస్థకు సంబంధించిన అన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. అయితే పాఠశాలను ప్రభుత్వం స్వాధీన పర్చుకొని ఉన్నత పాఠశాలగా మార్చాలని అభివృద్ధి కమిటీ కోరుతోంది. కార్యక్రమంలో డిఇఒ చంద్రకళ, డివైఇఒ సుభాని, తహశీల్దార్ విజయశ్రీ, ఎంపిడిఒ వి.హేమలతాదేవి, ఎంఇఒ నాగరత్నం, ఆర్ఐ సుబ్బారావు, సర్వేయర్ సురేంద్రనాథ్, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మూడో రోజు సమ్మె శిబిరంలో పాల్గొన్న ఇంజనీరింగ్ కార్మికులు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు సీనియర్ నాయకులు జె వి రాఘవులు

సమ్మెకు పెరుగుతున్న మద్దతు

ప్రభుత్వం సమస్యల్ని పరిష్కరించాలని కార్మికులు, నాయకుల డిమాండ్

ప్రజాశక్తి మంగళగిరి

ఇంజనీరింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమ్మె లో భాగంగా మంగళగిరిలో మంగళవారం నాటికి మూడో రోజు చేరింది. సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా నాయకులు ఎం రవి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. మంత్రి నారాయణ పట్టించుకునే పరిస్థితుల్లో లేరని విమర్శించారు. జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని ఇంజనీరింగ్ కార్మికులు అడుగుతున్న న్యాయమైన కోరికలను ప్రభుత్వం పరిష్కరించే స్థితిలో లేదని విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా వర్తింపజేయడం లేదని అన్నారు. సిఐటియు సీనియర్ నాయకులు జెవి రాఘవులు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 10 గంటల పని విధానాన్ని తీసుకురావడానికి విమర్శించారు. కార్మికుల శ్రమను దోచుకునేందుకు కూటమి ప్రభుత్వం పూనుకుందని అన్నారు. ఆప్కాస్ తీసివేస్తే ఉన్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని అన్నారు. అభ్యుదయ కార్మిక సంఘం నాయకులు ఆర్ సాంబశివరావు మాట్లాడుతూ వామపక్ష కార్మిక సంఘాలన్నీ సమ్మెకు మద్దతు తెలియజేసి ఉద్యమంలోకి రావాలని కోరారు. అందరూ ఐక్యంగా ఉండి సమ్మె చేస్తే ప్రభుత్వం దిగి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకష్ణ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కే శ్రీనివాసరావు, ఎం శ్రీనివాసరావు, వి శ్రీనివాసరావు, ఎస్ నాగరాజు, పి రాము, కేదార్నాథ్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి బుధవారం నుండి జరిగే సమ్మెకు వివిధ ప్రజా సంఘాలు మద్దతు తెలియజేశాయి. మంగళవారం సాయంత్రం మంగళగిరి సిఐటియు కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశ శంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం దిగివచ్చి సమస్యలను పరిష్కరించే అంతవరకు సమ్మెను ఉధతం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో పాలకవర్గం నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటలకు, అధికారం వచ్చిన తర్వాత చెప్పే మాటలకు పొంతన లేకుండా పోయిందని విమర్శించారు. ఈ సమావేశానికి సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సిఐటియు సీనియర్ నాయకులు జెవి రాఘవులు, జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, సిఐటియు నాయకులు టి శ్రీరాములు,ఏపీ సి ఎల్ స గుంటూరు జిల్లా నాయకులు జి గోపీనాథ్, ఏఐఎఫ్టియు న్యూ నాయకులు కే కోటేశ్వరావు, వైయస్సార్ టి యు సి నియోజకవర్గ అధ్యక్షులు ఆర్ శ్రీనివాసరాజు, కార్మిక సంఘం నాయకులు ఆర్ సాంబశివరావు, వివిధ మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులు రవి, శివ, కే శ్రీనివాసరావు, వి శ్రీనివాసరావు, ఎస్ నాగరాజు, పి రాము, కే కేదార్నాథ్ పాల్గొన్నారు.



తెనాలిలో కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

నేటి నుంచి తెనాలిలో నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - తెనాలి

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఇచ్చిన పిలుపుమేరకు మునిసిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు బుధవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్ళనున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ వి లక్ష్మీపతిరావుకు మంగళవారం సమ్మె నోటీసును అందజేశారు. యూనియన్ గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్ వలి నేతృత్వంలో కమిషనర్‌ను కలిసి జీవో ఎంఎస్ నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని, మున్సిపల్ అవుట్సోర్సింగ్ కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వ పథకాలను వర్తింపచేయాలని, గతంలో మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలకు జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దశల వారి ఆందోళన చేసినా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో సమ్మెలోకి వెళుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్ సురేష్ బాబు, సిహెచ్ దిలీప్ కుమార్, కోశాధికారి పి చక్రి, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

సమ్మె శిబిరంలో కార్మికులతో మేయర్

ప్రజాశక్తి-గుంటూరు

ఆప్కాస్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె కారణంగా నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగ కూడదని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. మంగళవారం తక్కెళ్ళపాడులోని హెడ్‌వాటర్ వర్క్సులో పర్యటించి తాగునీటి సరఫరా, ఫిల్టరేషన్లను పరిశీలించి, సమ్మె చేస్తున్న కార్మికులతో మాట్లాడారు.



సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న మేయర్

కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉందన్నారు. తాము కూడా ఆప్కాస్ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ దష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, యస్.ఈ నాగమల్లేశ్వరరావు, డి.ఈ.ఈ శ్రీనివాసరావు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



గత ప్రభుత్వ ఒప్పందాలను అమలు చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లి

గత ప్రభుత్వం సమ్మె కాల సందర్భంగా కుదుర్చుకున్న ఒప్పందాలు కు సంబంధించి జీవోలను విడుదల చేసి కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మహానాడులో పారిశుధ్య కార్మికుల ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తెల్లవారుజామున లేచి పట్టణమంతా శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ 26000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో రక్షణ పరికరాలు ఇవ్వాలని కోరారు. గత నెల రోజుల నుండి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించినందుకు ఈనెల 16వ తేదీ బుధవారం నుండి కార్మికులు సమ్మెలోకి వెళ్తున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చల ద్వారా కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, నాగమణి, రాము, ద్రాక్షాయిని పాల్గొన్నారు.

ఎంటిఎంసి వద్ద బదిలీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి లో పనిచేస్తున్న బదిలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం రాత్రి మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. తోటి పారిశుధ్య కార్మికులతో సమానంగా ఆప్కాస్ లో చేర్చి రూ.21000 జీతం ఇవ్వా లని డిమాండ్ చేశారు. చెప్పులు, సబ్బులు, నూనె ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కొరకు బుధవారం నుండి సమ్మెలోకి వెళు తున్నట్లుగా చెప్పారు. ఆదివారం, పండుగ రోజుల్లో సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతనం 10000 మాత్రమే ఇస్తున్నారని, 21 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. అనంతరం కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, వైయస్సార్ టియుసి నియోజవర్గ అధ్యక్షులు ఆర్ శ్రీనివాసరాజు, అభ్యుదయ కార్మిక సంఘం నాయకులు ఆర్ సాంబశివరావు, ఫెడరేషన్ నాయకులు ఎం శ్రీనివాసరావు, కే శ్రీనివాసరావు, వై శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బదిలీ కార్మికులు

గుంటూరు పశ్చిమలో రూ.1.87 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు

అభివృద్ధి పనులు నిర్దేశిత సమయానికి, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. గుంటూరు పశ్చిమ నియోకజవర్గం, 37వ డివిజన్‌లో రూ.1.87 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడానికి మంగళవారం ఎమ్మెల్యే మాధవితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నగరంలో అవసరమైన ప్రాంతాలలో అభివద్ధి పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. శివారు ప్రాంతాలలో కూడా అభివద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా ప్రజావసరాలను దష్టిలో ఉంచుకొని పనులు చేపడుతున్నామని చెప్పారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, వారి అవసరాలను దష్టిలో ఉంచుకొని అభివద్ధి పనులు చేస్తున్నామన్నారు. అలాగే త్రాగునీరు, పారిశుధ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించి, అధికారులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. సదరు కార్యక్రమంలో కార్పోరేటర్లు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కోట శ్రీనివాసరావు మృతికి సంతాపం

ప్రజాశక్తి- తాడేపల్లి

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో విలక్షణ నటన కనబరిచిన కోట శ్రీనివాసరావు అకాల మరణం కళా రంగానికి తీరని లోటని సినీ, నాటకరంగ సీనియర్ కళాకారులు ఉండవల్లి పార్ధసారథి, జొన్న రామలింగేశ్వరరావులు సంతాపం వ్యక్తపరిచారు. పాత్ర ఏదైనా తన నటనా కౌసల్యంతో ప్రేక్షకులను అలరించే అద్భుత నటులు కోట శ్రీనివాసరావు అని కొనియాడారు. రెండు దొండకాయలే వండాలనే పిసినారిగా నటించినా, కుప్పతొట్లో పండిన అంటూ యాసలు పలికించే విలన్‌గా అలరించినా, కన్నీరు పెట్టించే విషాద పాత్రలో అయినా కోట నటనకు మరెవ్వరూ సాటి రారని కీర్తించారు. తెలుగు చలనచిత్ర సీమలో కోట శ్రీనివాసరావు ఓ అజరామరమైన నటుడని కొనియాడారు. తరాలు మారిన ధ్రువతారగా ప్రజల గుండెల్లో నిలిచిపోయే కోట శ్రీనివాసరావుకు అశ్రునివాళులు అర్పిస్తున్నట్లు చెప్పారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.



బాధితుల నుండి వివరాలు తెలుసు కుంటున్నా శివాజీ

కుల బహిష్కరణ హేయమైన చర్య

ప్రజాశక్తి - పెదకాకాని

నేటి ఆధునిక యుగంలో కూడా గ్రామాలలో కుల బహిష్కరణలు జరగటం అమానుషం అని సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామం జంగాల కాలనీలో కుల బహిష్కరణకు గురైన కుటుంబాన్ని శివాజీ మంగళవారం సందర్శించారు. బాధితులైన శ్రీపాటి ఆదెమ్మ,నాగరాజు,రమేష్ నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు బాధితులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల క్రితం తప్పు కింద 3 లక్షల రూపాయలు కట్టించారని తరచు వేధిస్తున్నారని ఎవరైనా ఎదురు మాట్లాడితే వారిని బెదిరిస్తున్నారని వాపయ్యారు. శివాజీ మాట్లాడుతూఇలాంటి సాంఘిక దురాచారాలను సిపిఎం ఖండిస్తుందని నిజా నిజాలను అధికారులు పరిశీలించి సత్తరమే సమస్య పరిష్కరించాలని ఇటువంటి ఘర్షణలు జరగకుండా బాధితులకు న్యాయం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి బి బాబురావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు రమేష్‌కుమార్

పాఠశాలను పరిశీలించిన రాష్ట్ర బృందం

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని 75 త్యాళ్ళూరు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సీమ్యాట్ లెక్చరర్, రాష్ట్ర పరిశీలకులు పి.రమేష్‌కుమార్ మంగళవారం సందర్శించారు. అటల్ ల్యాబ్ ఒకేషనల్ ల్యాబ్, పీఎంశ్రీలో జరుగుతున్న లైబ్రరీ వర్క్, రాంప్ రైలింగ్, కిచెన్‌గార్డెన్, రెయిన్ వాటర్ హార్వే స్టింగ్,ప్లే ఫీల్డ్ మొదలైన పనులను పరిశీలించారు. స్కూల్ క్వాలిటీ ఎసెస్మెంట్ ఫ్రేమ్‌వర్క్ ఎండిఎంను, ఇతర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. తర్వాత విద్యార్థులతో పలు అంశాల పై మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్.ఎం ఎ.శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయులు ఎఇ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.


పోలింగ్ బూత్‌ను తహశీల్దార్ పరిశీలన

ప్రజాశక్తి - దుర్గి

స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 49వ పోలింగ్ బూతును మంగళవారం తహశీల్దార్ కిరణ్‌కుమార్ పరిశీలించారు. బూత లెవల్ అధికారులతో మాట్లాడుతూ బూత్‌లలో ఏవైనా మార్పులు, చెర్పులు ఉంటే చేసుకోవచ్చని తెలిపారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, మరణించిన వ్యక్తుల వివరాలను ఓటర్ లిస్టులో నుండి తొలగించాలని తెలిపారు. అనంతరం ముటుకూరులోని ప్రాథమిక పాఠశాల మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు జూనియర్ అసిస్టెంట్ వెంకట్రావు వీఆర్వోలు పాల్గొన్నారు.

ఇంటింటికి తాగునీరు ఇవ్వాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు : ఇంటింటికీ తాగునీరు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు ఎంపీటీసీ ఎం.సాంబశివరావు, మాజీ సర్పంచ్ షేక్ బాజీ మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. వీధిలైట్లు, విద్యుత్తు స్తంభాలు, చేతి బోర్ పంపులు, సిమెంట్ రోడ్ డ్రెయినేజీ సమస్యలు, దోమల ఉధృతి, రోడ్లపై బ్లీచింగ్ సానిటరైజేషన్, ఇంట్లో ప్రతి ఇంటికి కుళాయిలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో కె.నాగేశ్వరరావు, షేక్ నన్నేసా షరీఫ్, జి.నరేంద్ర, కె.నరేష్, పి.శేషగిరిరావు, పి.మల్లేశ్వరరావు, అత్తోట జోజప్ప తదితరులు పాల్గొన్నారు.



వేణుమాధవ్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సుధీర్, ఇతరులు

లెక్చరర్ వేణుమాధవ్‌కు పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

శ్రీ సుబ్బరాయ, నారాయణ కళాశాలలో బోటనీ డిపార్టుమెంట్ ఇంచార్జ్‌గా విధులు నిర్వహిస్తున్న రాజనాల వేణుమాధవ్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి పిహెచ్‌డి పట్టా పొందారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎస్. సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజనాల వేణుమాధవ్ క్వాంటిటీటివ్ స్టడీస్ ఆన్ ఇథనోమెడిసినల్ ప్లాంట్స్ యూస్డ్ బైప్రేమిటివ్ ట్రైబ్స్ అఫ్ పాడేరు డివిజన్, అల్లూరి సీతారామ రాజు జిల్లా మీద చేసిన పరిశోధనకుగాను పట్టా అందుకున్నారు. కళాశాల కమిటీ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్, సుబ్బరాయ గుప్తా, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది వేణుమాధవ్‌ను అభినందించారు.

పెరిగిన ఎండ తీవ్రత

మేత, నీరు లేక అల్లడుతోన్న పశువులు

రాత్రి 11 గంటలైనా తగ్గని వేడి గాలులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రస్తుతానికి పట్టణంలోని, మండలంలోను తీవ్రమైన ఎండలు, వేడిగాలులతో ప్రజలు, మేకలు, పశువులు, పక్షులు అల్లాడిపోతున్నాయి. మే నెల రోహిణీ కార్తె ప్రారంభంలోనే వర్షాలు కురిసి వాతావరణం చల్లబడటంతో ప్రజల హర్షం వ్యక్తం చేశారు. పశువులు, పక్షులు కొంత సేదరాయి. ఈ యేడాది ఎండలు తెలియకుండానే వెళ్లి పోయాయి. మండల స్థాయిలో ఎక్కడా భారీ వర్షాలు లేక వాతావరణంలో వస్తున్న మార్పులతో పశుపక్ష్యాదులు, మనుషులు తట్టుకోలేకపోతున్నారు. 3, 4 రోజులుగా వడ గాలు లతో కూడిన ఎండ తీవ్రత కనిపిస్తోంది. సోమవారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రిళ్లు వేడిగాలులు తప్పడం లేదు. సోమ, మంగళవారాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 11గంటల వరకు వేడిగాలులు వీచాయి. వేసవిని తలపిస్తున్న వేడి వాతావరణంతో విద్యుత్ వినియోగం పెరిగింది. శరీర రుగ్మతలు, శాశ్వకోస సమస్యలన్న వారికి ఊపిరాడని పరిస్థితులున్నాయి. వేసవి తీవ్రత ప్రభావం వల్ల నిరుపేదలు మరింతగా అల్లాడిపోతున్నారు. పొలాల్లో నీరులేక గొడ్లకు మేత కరువైంది. జూన్ నెల మధ్య నుంచి భారీవర్షాలు కురిసి విద్యుత్ వినియోగం తగ్గాల్సి పోయి వర్షాలు ముఖం చేటాశాయి. వర్షాలు ఎపుడు కురుస్తాయో, ఎండ తీవ్ర ఎపుడు తగ్గుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.



చిలకలూరిపేటలో ఎండలకు నిర్మానుష్యంగా మారిన రోడ్డు

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్లలో ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవు తున్నాయి. మండు తున్న ఎండలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. వర్షాకాలమొచ్చినా వేసవిని తలపించేలా కాస్తున్న ఎండలకు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వారం రోజులుగా ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు తీవ్రమైన ఎండలు కాస్తున్నాయి. ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. నిత్యం రద్దీగా వుండే ప్రధాన రహదారులు ఎండలకు జన సంచారం లేక బోసిపోతున్నాయి. దీనికి తోడు ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కి రవుతున్నారు. వర్షాకాలానికి ముందే తొలకరి పలకరించటంతో ఈ ఏడాది వేసవిలో రోహిణికార్తె ఎండల నుండి ప్రజలకు కొంత ఉపశమనం పొందారు. ఆ తరువాత రుతుపవనాలు చాటేయ డంతో ఎండలు తీవ్రమయ్యాయి. రోజురోజుకి పెరుగుతోన్న ఉష్ణోగ్రతలు ఎప్పుడు తగ్గుతాయోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.



మాచర్లలో ...

డిఆర్‌డిఎ పీడీ ఎంపిడిఒ కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి - యడ్లపాడు

పల్నాడు జిల్లా డిఆర్‌డిఎ పీడీ ఎమ్మెస్ మూర్తి మంగళవారం ఎడ్లపాడు ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఉపాధి హామీ పనుల నిర్వహణ ప్రగతి విషయాలపై అధికారుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. ఈ ఏడాది చేపట్టవలసిన లక్ష్యాలను ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలని సూచించారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2.74 లక్షల జాబ్ కార్డులు యాక్టీవ్‌లో ఉండగా, ఆయా కార్డులో 4.68 లక్షల మంది శ్రామికులు ఉన్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది ఉపాధి హామీ రూ. 45 లక్షలు జిల్లా లక్ష్యం కాగా ఇప్పటికే రూ.55.13 లక్షల పనుల ప్రగతిని సాధించామని చెప్పారు. గతేడాది జిల్లాలో 740 గోకుల షెడ్లను ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేయగా వీటిలో 63 బేస్ లెవెల్‌లో ఉండగా మిగిలినవన్నీ వివిధ దశలో నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఉద్యాన పంటలకు ప్రోత్సాహకారంగా ఉపాధి హామీ పథకం నుండి 100శాతం రాయితీతో వివిధ పంటలను రైతులు సాగు చేసేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 631 ఎకరాలలో వివిధ రకాల పండ్లు, పూల తోటల్ని 582 మంది సాగు చేస్తున్నట్లు వెల్లడించారు మామిడి, నిమ్మ, నారింజ, సపోటా, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, యాపిల్, బేర్ పంటలతో పాటు నూతనంగా డ్రాగన్ ఫ్రూట్స్, కొబ్బరి మొక్కలు, పామాయిల్, మునగ, పూల మొక్కల్లో గులాబీ, మల్లెతోటల్ని ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. ఉపాధి పథకంలో 12 రకాల పండ్ల సాగు అవకాశం ఉన్నప్పటికీ జిల్లాలోని నేలస్వభావం, వాతావరణ ప్రభావా నికి అనుకూలంగా ఉండే వాటిని మాత్రమే ప్రోత్సహించి రైతులు నష్టపోకుండా చూస్తున్నామన్నారు.



తల్లులతో మాట్లాడుతున్న ప్రజాకవి శేషారావు

సమాజ నిర్మాతలు తల్లులే

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఉన్నతమైన సమాజాన్ని నిర్మించడానికి తల్లుల పాత్ర కీలకమని ప్రజాకవి, పిడిఎఫ్ కన్వీనర్ దర్శి శేషారావు తెలిపారు. మంగళవారం పెదకూరపాడులో విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించడానికి తల్లులు చేయవలసిన పనుల గురించి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ కుటుంబాలలో తల్లిదండ్రులు చిన్నచిన్న మార్పులు చేసుకుంటే వారి పిల్లలు ఉన్నత శిఖరాలకు అధిరోహించే విధానాన్ని వివరించారు. అభ్యుదయ భావాలు కలిగిన సమాజాన్ని నిర్మించే నిర్మాతలు తల్లులే అన్నారు. ప్రతి ఒక్కరిలో అనంతమైన శక్తి ఉంటుందన్నారు. శక్తిని ఉపయోగించుకొని అద్భుతాలు సృష్టించవచ్చునన్నారు. టెక్నాలజీలో వస్తున్న మార్పులు, వాటిని వినియో గించే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో తల్లులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సువర్ణకుమారి

మంచి అలవాట్లపై అవగాహన

ప్రజాశక్తి - యడ్లపాడు

వ్యక్తిగత శుభ్రత, విద్యార్థులకు మంచి అలవాట్లపై నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చురుగ్గా సమాధానాలు చెప్పిన విద్యార్థులకు పెన్నులు, స్లేట్ పెన్సిళ్లు బహుమతిగా ఇచ్చారు. విద్యార్థులకు చేతుల శుభ్రత, దగ్గు జలుబు ఉన్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహారము ఏ విధంగా తీసుకోవాలి, నీళ్ల రోజుకి ఎన్ని తాగాలి, రాత్రుల్లో నోటి శుభ్రత, తగ్గినప్పుడు తుమ్మినప్పుడు జాగ్రత్తలు, రోజుకి ఎన్ని గంటలు నిద్రపోవాలి, చేతి గోళ్ల ఏ విధంగా తీసుకోవాలి, ఎన్ని రోజులకు తీసుకోవాలి, కంటి జాగ్రత్తలు, ఈగల వలన వచ్చు వ్యాధులు, వాటి గురించి జాగ్రత్తలు, దోమల వలన వచ్చే వ్యాధుల గురించి జాగ్రత్తలు, నోటిని రోజూ ఏ విధంగా దేనితో శుభ్రం చేసుకోవాలి, ఆరుబయట మలవిసర్జన చేయటం వల్ల వచ్చే వ్యాధుల ప్రమాదం గురించి, ఇంటి మరుగుదొడ్డి వాడటం ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూలు టీచర్స్ మరియు నరేంద్ర సువర్ణ కుమారి పౌండేషన్ అధ్యక్షురాలు సువర్ణ కుమారి, ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్ రావు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చే వరకు పోరాటం

ప్రజాశక్తి - దుర్గి

కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు సిపిఐ పోరాటం చేయాలని పల్నాడు జిల్లా సిపిఐ కార్యదర్శి మారుతీ వరప్రసాద్ అన్నారు. మంగళవారం వాసవీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైన ఇంతవరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతు భరోసా రూ.20వేలు, మహిళలకు సంవత్సరానికి రూ.18వేలు నిరుద్యోగ భృతి, ప్రభుత్వ ఉద్యో గాలు ఇచ్చే వరకు పోరాటం చేయాలని ఆయన కార్యకర్త లకు తెలిపారు. బొల్లాపల్లి మండలం రూ.87వేల కోట్లతో బసకచర్ల ప్రాజెక్టు నిర్మాణం ఎప్పుడు పూర్తి అవుతుందో తెలపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిట్టిప్రోలు అమరేశ్వర రావు, జిల్లా సహాయ కార్యదర్శి కాషా రాంబాబు, షేక్ హుస్సేన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము పాల్గొన్నారు.

ఎరువుల వాడకం తగ్గించండి : డీఆర్సీ డీడీఏ

ప్రజాశక్తి - పెదకూరపాడు

రైతులు ఎరువులు వాడకం తగ్గించుకోవాలని జిల్లా డీఆర్సీ డీడీఏ శివకుమారి కోరారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులకు శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు. జీవన ఎరువుల వినియోగం పెంచాలన్నారు. మిరప ఇతర పంటలు వేయబోయే రైతులందరూ పిఎండిఎస్ 30 రకాలు విత్తనాలు వేసుకోవాలన్నారు. ఎరువులు విత్తనాలు పురుగుమందులు కొనుగోలు చేసేటప్పుడు బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. వంటకాలం పూర్తి అయ్యేవరకు వాటిని భద్రపరచాలని తెలిపారు. పురుగు మందులు విచ్చలవిడిగా వాడరాదన్నారు. పెదకూరపాడు వ్యవసాయ శాఖ అధికారి డి.కృష్ణయ్య మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ విధివిధానాలను వివరించారు. ఖరీఫ్ 2025లో పత్తి సాగు చేయు రైతులు వాతావరణ ఆధారిత పంటలైన వరి, కంది, ఎర్ర మిరప రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద బీమా చేయించుకోవాలని కోరారు. ఆయన మాట్లాడుతూ వరి పంటకు ఎకరాకు రూ.80లు ప్రీమియం చెల్లించేందుకు ఆగస్టు 15వతేదీ లోపు అవకాశం ఉందన్నారు. కంది పంటకు ఎకరాకు రూ.40లు, ఎర్ర మిరప సాగు చేయ రైతులు ఎకరాకు రూ.360లు ప్రీమియం ఈనెల 31వ తేదీ లోపు చెల్లించవచ్చునన్నారు. పంట సాగు చేయు రైతులు వాతావరణ ఆధారిత పంటల కింద ఎకరాకు రూ.1900లు చొప్పున ప్రీమియం ఈనెల15 లోపు చెల్లించి పంటల బీమా చేయించుకోవాలన్నారు. డిఆర్సీ ఏఓ అరుణ్‌కుమారి, సర్పంచ్ గుడిపూడిరాజు, మండల టిడిపి అధ్యక్షులు వై బ్రహ్మయ్య, డీసీ చైర్మన్ వి అప్పారావు, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు, రాష్ట్ర అభ్యుదయ రైతు అవార్డు గ్రహీత, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషారావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమారి

నేడు అవగాహ ర్యాలీ

ప్రజాశక్తి - మాచర్ల

మధ్యవర్తిత్వం పట్ల అవగాహన కల్పించేందుకు కోర్టు ప్రాంగణం నుండి జడ్‌పి బాలికల హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు న్యాయమూర్తి శ్రీనివాసకళ్యాణ్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పలుఅంశాలల్లో మధ్యవర్తిత్వం చేసే మేలు ప్రయోజనంగా ఉంటుందన్నారు. మధ్యవర్తిత్వంపట్ల ప్రజలకు ముఖ్యంగా కక్షిదారులకు అవగాహన కల్పించేందుకు కోర్టు వద్ద నుండి ప్రభుత్వ బాలికల హైస్కూల్ వరకు బుధవారం ఉదయం 9 గంట లకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో న్యాయవాదులు, పోలీసులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



డాక్టర్ సజ్జా చంద్రమౌళికి నివాళి

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరులో చీరాల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సజ్జా చంద్రమౌళి 98వ జయంతిని మంగళవారం నిర్వహించారు. జిబిసి రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.వారు మాట్లాడుతూ చేనేత కార్మికు లకు, వైద్యరంగానికి ఆయన చేసిన సేవలు మరువరాని వని కొనియాడారు. చీరాల పరిసర ప్రాంతాలకు, పొన్నూ రు పట్టణానికి ఆయన చేసిన సేవలు అమోఘం అన్నా రు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ సజ్జా హేమలత, డాక్టర్ సజ్జారవీంద్రబాబు, పట్టణ ప్రముఖులు వివిధ పార్టీలకు చెందిన నేతలు, వైద్యులు పాల్గొన్నారు.



పేదలకు అన్నం పొట్లాలు అందజేసిన రమ్యరూప, ఇతరులు

బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అన్నదానం

ప్రజాశక్తి - పొన్నూరు

మన పొన్నూరు బ్లడ్‌వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణానికి చెందిన బండారు శ్రీనివాస రావు కుమార్తె బండారు రమ్యరూప పుట్టినరోజు సందర్భంగా అంబేద్కర్‌కాలనీ యానాది సంఘంలో ఉంటున్న పేదవారికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. తిరుమల శెట్టి ఉమాశంకర్ రమ్య రూప తల్లి చెంచులక్ష్మికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి గుడివాడ పవన్, ట్రెజరీ చిలకపాటి సింహాద్రి పాల్గొన్నారు.



మొక్కలు నాటిన రోటరీ క్లబ్ ప్రతినిధులు

లక్షన్నర మొక్కలు నాటిన ప్రెగడ రాజశేఖర్

ప్రజాశక్తి - మంగళగిరి

రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, 2025-26వ సంవత్సరానికి ప్రథమ సేవా కార్యక్రమంగా ప్రెసిడెంట్ ప్రెగడ రాజశేఖర్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి గాలి గోపురం పరిసరాలలో సుమారు లక్షా 50వేల మొక్కలను మంగళవారం నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా డిస్ట్రిక్ట్ గవర్నర్ కోటి మొక్కలు నాటాలనే లక్ష్యాన్ని సాధించే దిశగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు రాజశేఖర్ తెలిపారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్.వి.రామ్ ప్రసాద్ మొదటి మొక్కను నాటారు. ఆలయ ఈవో, సహాయ కమిషనర్ కే సునీల్‌కుమార్, పిడిజి అన్నే రత్న ప్రభాకర్, అసిస్టెంట్ గవర్నర్ పూర్ణ చందు, సెక్రెటరీ నిరంజన్ గుప్తా, చార్టర్ ప్రెసిడెంట్ ఇసునూరి అనిల్ చక్రవర్తి, పాస్ట్ ప్రెసిడెంట్ గాజుల శ్రీనివాసరావు, ట్రెజరర్. కెవిఎస్ ప్రకాశరావు, పాస్ట్ సెక్రెటరీ అందే మురళి, రొటేరియన్స్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెరిగిన మహిళా చైతన్యం

పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్

ప్రజాశక్తి - తాడేపల్లి

రాష్ట్రంలో మహిళా చైతన్యం పెరిగిందని పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని అవంత బ్రాంకెట్ హాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో జరిగిన వర్క్ షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మెప్మా అన్నీ మున్సిపాలిటీలలోఅప్ గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు. పేద మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు స్వయం సహాయక సంఘాల ద్వారా జీవనోపాధి కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో ఈరోజు సోషల్ మీడియాలో రీల్ మేకర్ పెద్ద వ్యాపారంగా ఉన్న సంగతిని గుర్తు చేశారు. టెక్స్టైల్స్, కుకింగ్, వేస్ట్ మేనేజ్‌మెంట్ లాంటి వాటినుండి ఉపాధి లభిస్తుందని చెప్పారు. రాబోయే మూడునెలల్లో ఆన్లైన్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించి 25 లక్షల మహిళలకు ఎకనామిక్ యాక్టివిటీ కల్పించాలని అధికారులను ఆదేశించారు. 2026 సంవత్సరానికి 30 వేల మందికి యూనిట్‌ల ద్వారా కోటి టర్న్ ఓవర్‌కు అప్ గ్రేడ్ చేయాలనీ, ఇందుకు అన్ని స్థాయిలలోని అధికారులు కృషి చేయాలని కోరారు. ఇది ఒక లక్ష్యంగా అధికారులు తీసుకోవాలన దిశానిర్దేశం చేశారు. మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్. తేజ్‌భరత్ పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు



224 రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 224 రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, దర్శి మాణిక్యారావు, వై.సాంబశివరావు ప్రారంభించారు. దీక్షలలో దేరంగుల రమణమ్మ, మొలక శారద, గండికోట జ్యోతి, దామవరపు సువర్ణకుమారి, బి. నవనీతం కూర్చున్నారు. యూనియన్ నాయకుడు కే. స్టీవెన్ మాట్లాడుతూ అసలు యజమాని ఏసీసీ తప్ప మిగతా కంపెనీ ఏది కోర్టుకు హాజరుకావటంలేదని చెప్పారు. ఎన్ఆర్ఐ పాత్ర ఏమిటనేది త్వరలోనే తెలుస్తుందని పేర్కొన్నారు. కార్మికులు మన పరిహారం అందే వరకు ఓపికగా వుండాలని, మన సమస్యకు ముగింపు దగ్గరలో ఉందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో యహెూషువ, యం.ఆశీర్వాదం, షైక్ ఆరిఫ్, మల్లె గురవయ్య, తుపాకుల నాగేశ్వరావు, బి సూర్యప్రకాశరావు, డి నాగేశ్వరావు,జి నాగరాజు, అంకయ్య, షైక్ హిమాంబి, వై రమాదేవి, దుర్గాభవానీ, శివకుమారి, శారమ్మ, కాసమ్మ, అన్నమ్మ, రిబ్కా పాల్గొన్నారు.

ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవంపై సదస్సు



నైపుణ్యాభివృద్ధి అంశాలపై మాట్లాడుతున్న ఎన్‌సిసి విద్యార్థి

ప్రజాశక్తి - తెనాలిరూరల్

స్థానిక చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ బాలుర పాఠశాల, కొత్తపేటలోని రావి సాంబయ్య బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా 22 వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ ఆకుల ఉదయ్‌కుమార్ హాజ రయ్యారు. ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం మొదటిసారిగా 2014లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ప్రకటించిందని, అప్పటి నుంచి ప్రతి ఏడాది జూలై 15న దీన్ని జరుపుకుంటామని తెలిపారు. యువత ఉద్యోగ అవకాశాలు పొందకపోవడానికి ప్రధాన కారణం విద్యార్థులు ఎంచుకున్న రంగంలో నైపుణ్యాభివృద్ధి పొందక పోవడమేనన్నారు. వీటి విద్యాసంస్థలు ప్రభుత్వం దృష్టి పెట్టాల న్నారు. యువతకు నైపుణ్యాల ఆధారిత విద్య, శిక్షణను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకతపై అవగాహన పెంచటం కార్యక్రమ ముఖ్యఉద్దేశమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కప్పల రాజారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ అసోసి యేషన్ ప్రెసిడెంట్ కొండూరి శ్రీనివాసరావు, ఎన్సిసి ఆఫీసర్ పరిశా సర్దార్, సీనియర్ ఉపాధ్యాయులు ఈ.అంబరీశుడు, బాయ్స్ హైస్కూల్ ఇంచార్జ్ ఎన్.ఇందుశేఖర్, కొడాలి గోవర్ధన ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవాన్ని ఏర్పాటు చేయాలనే ఐక్యరాజ్య సమితి తీర్మానంపై మాట్లాడారు. కార్యక్రమంలో మునిపల్లె మస్తాన్‌రావు, మీసాల శ్యామ్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతపై ఎంపిటిసిల అసహనం

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఎంపీపీ షేక్‌జబీన్ అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సమస్యలు లేవనెత్తారు. మండల పరిధిలోని గ్రామాలలో తరచుగా కరెంటు పోవడం, ఎంపీటీసీ సభ్యుల జీతాలు సక్రమంగా చెల్లించకపోవడం, పెద్దపాలెం గ్రామంలో ఆగిన పీహెచ్సీ భవనం నిర్మాణం, పెద్ద కొండూరు ఆలయం వద్ద నీటి పంపు ఏర్పాటు చేయకపోవడం వంటి అంశాలను సమావేశం దృష్టికి తెచ్చారు. అధికారులు సభ్యుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. మండల వ్యవసాయాధికారి ఆర్.విజయబాబు మాట్లాడుతూ మండల పరిధిలో 15101 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత పొంది నట్లు తెలిపారు. టార్పాలిన్ పట్టలు మోటార్లు రవి సీజన్ నాటికి అందజేస్తామన్నారు. ఈఓపిఆర్‌డి జోహార్‌లాల్ నెహ్రూ మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి పంచాయతీ సిబ్బంది తడి, పొడి చెత్త సేకరించిన విషయంలో దుగ్గిరాల, ఈమని గ్రామాలు రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉన్నట్లు తెలిపారు. ఎంపీడీవో పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డుపై చెత్త వేస్తే రూ.500లు జరిమానా విధిస్తారని తెలిపారు. ములగాకుకు డిమాండ్ ఉందనీ, రైతులు ములగాకు పండిస్తే ప్రభుత్వమే మార్కెటింగ్ కల్పిస్తుందనీ, తద్వారా రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని చెప్పారు. ఏపీఎం జి.సురేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు పసుపులేటి సాయిచైతన్య, మరిదు రామయ్య, డాక్టర్ అబ్దుల్ రహమాన్, డాక్టర్ శ్రీవల్లి, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఎలక్ట్రికల్ ఏఈఈ సత్యనారాయణ, సూపరింటెండెంట్ చంద్రమోహన్ వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి



ఆపరేషన్లు చేయించుకున్న వృద్ధులు

23 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి బాపనయ్యనగర్, మున్సిపల్ పాఠశాలలో మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన అమరావతి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈనెల 13వ తేదీన నిర్వ హించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో అవసరమైన 23 మందికి మంగళవారం కంటి శుక్లాల ఆపరేషన్లు చేశారు. ఈ సందర్భంగా అవార్డు టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తురకా వీరశేఖర్, తోట కరుణ కుమార్‌యాదవ్ మాట్లాడారు. మంత్రి లోకేష్ స్ఫూర్తితో టీడీపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అమరావతి కంటి ఆసుపత్రి పేద, మధ్య తరగతి ప్రజల వద్దకే వచ్చి వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి సేవలు అందించడం అభినందనీయమన్నారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన పార్టీ పట్టణ కమిటీకి, అమరావతి కంటి ఆసుపత్రి వైద్య సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అవార్డు టీడీపీ నాయకులు కోలా శ్రీనివాసరావు, పసుపులేటి సదాశివ రావు, గాజుల క్రాంతికుమార్, తెలుగు మహిళా నాయకురాలు రజియాబేగం పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సునీత

అన్నవరం, కొప్పరు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని అన్నవరం, కొప్పరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు నుండి బీసీ ల్యాబ్ సహాయ వ్యవసాయ సంచాల కులు సునీత అబ్జర్వర్‌గా విచ్చేశారు. రైతులకి ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్, భూసార పరీక్షల వలన కలిగే ప్రయో జనాలు గురించి వివరించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించాలని సూచించారు. మండల వ్యవ సాయాధికారి ఐ.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ముందుగా హెచ్డీ బర్లీ పొగాకు రైతులకు 20 క్వింటాళ్లు ఇచ్చి పొగాకు మిగిలితే రెండవసారి 20 క్వింటాళ్లు దామాషా వంతున ఇస్తారని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో కొప్పరు విహెచ్‌ఎ గోపి, ప్రశాంతి పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

పారిశుధ్య పనుల్లో జాప్యం వద్దు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో వార్డుల వారీగా పారిశుధ్య పనులను జాప్యం చేయకుండా క్రమం తప్పకుండా నిర్వహిం చాలని మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. పట్టణంలోని 26వ వార్డులో మంగళవారం పారిశుధ్య కార్మికులు మెయిన్ డ్రెయిన్, సైడ్ డ్రెయిన్ల లో వ్యర్థాలను తొలగించారు. వీధులలో ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించిన ఆమె శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట వార్డు కౌన్సిలర్ షేక్ నూర్ ఇస్మాయిల్, మున్సిపల్ హెల్త్‌ఆఫీసర్ ఎం. ఏసుబాబు, టౌన్ ప్లానింగ్ అధికారి సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా గ్రంథాలయ సంస్థకు సంబంధించిన 2025-26 సంవత్సరానికి బడ్జెట్ అంచనాలను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ ఆధ్వర్యంలోని కమిటీ మంగళవారం ఆమోదించింది. కలెక్టరేట్‌లోని జెసి ఛాంబర్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశము నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అధ్యక్షత వహించారు. సభ్యులుగా జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, వయోజన విద్య ఉప సంచాలకులు, సమాచార పౌరసంబంధ శాఖ అధికారులు ఉన్నారు. సర్వసభ్య సమావేశం అజెండాలో మొత్తం 14 అంశాలు చర్చించి ఆమోదించారు. ఇందులో భాగంగా 2025-26 సంవత్సరంనరనకు బడ్జెట్లో వివిధ పద్దులకు కేటాయించిన సొమ్ము రూ. 45,88,43,609 ఖర్చు చేసుకొనుటకు సర్వసభ్య సమావేశం ఆమోదించింది.

ఢిల్లీకి మేయర్, కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సూపర్ లీగ్ సిటి అవార్డ్‌ను ఈ నెల 17న ఢిల్లీలో ప్రధానం సందర్భంగా నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం రాత్రి గుంటూరు నుంచి బయలుదేరి ఢిల్లీ వెళ్లారు. తిరిగి 18వ తేదీన కమిషనర్ విధుల్లో చేరనున్నారు. అప్పటి వరకు నగర కమిషనర్ ఇన్‌చార్జిగా వ్యవహరించనున్న అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు వ్యవహరిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

జాతీయస్థాయి పోటీలకు చరణ్ తేజ్

ప్రజాశక్తి మంగళగిరి



చరణ్ తేజ్‌ను అభినందిస్తున్న టిడిపి నాయకులు

చత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని బిలాస్ పూర్‌లో జూలై చివర్లో జరుగనున్న జాతీయ స్థాయి బోసి గేమ్స్ కు మంగళగిరిలోని పిఎంఎవై ఎన్టీఆర్ నగర్ టిడ్కో కాలనీకి చెందిన ఉద్దంటి చరణ్ తేజ్ ఎంపిక య్యారు. పుట్టుకతో మూగవాడైన చరణ్ తేజ్ మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి చినకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి బోసీ గేమ్స్ పోటీల్లో చరణ్ తేజ్ ద్వితీయ స్థానం సాధించాడు. జాతీయ స్థాయి బోసి గేమ్స్ పోటీలకు ఎంపికైన చరణ్ తేజ్ కు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో మార్కెట్ యార్డ్ మాజీ వైస్ ఛైర్మన్ మన్నెం రమేష్ మంగళవారం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షులు మానం సుబ్బారావు

పెన్షనర్ల వర్గీకరణ చట్టంతో ఆందోళన

నరసరావుపేటలో పెన్షనర్ల ప్రదర్శన - నిరసనగా సభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ఆమోదించిన పెన్షనర్ల వర్గీకరణ చట్టం వల్ల పెన్షనర్లలో ఆందోళన నెలకొందని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు మానం సుబ్బారావు అన్నారు. సంఘం దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం నరసరావుపేట పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో సభ్యులు సంఘ భవనం వద్ద నుండి ధర్నా చౌక్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ధర్నా చౌక్ వద్ద సభలో సుబ్బారావు మాట్లాడుతూ విధులు ముగిసిన ఏడాది, పదవీ విరమణ తేదీ, నియమాల ఆధారంగా వేర్వేరు వర్గాల్లో ఉంచడంతో సీనియర్ పెన్షనర్లకు తక్కువ, జూనియర్ పెన్షనర్లు ఎక్కువ పెన్షన్ పొందే పరిస్థితి ఉందన్నారు. సమాన విధులు నిర్వహించిన వారికి సమాన పెన్షన్ రావాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ పెన్షనర్ల హక్కులకు, భద్రతకు ముప్పు తలపెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన పెన్షనర్ల వర్గీకరణ చట్టంపై రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్ దారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. చట్టం అమలుతో వేతన సవరణ, ఏరియర్స్, కరువు భత్యాలు, మెడికల్ రీయింబర్స్మెంట్ వంటి అంశాల్లో న్యాయం జరగదన్నారు. అనంతరం కలెక్టరేట్లో వినతిపత్రం అందజేశారు. సంఘం సెక్రెటరీ సి.సి ఆదయ్య, కోశాధికారి ఎంఎస్.ఆర్.కె ప్రసాద్, ఆర్గనైజర్ సెక్రెటరీ కె.వి చలపతిరావు, జాయింట్ సెక్రటరీ పచ్చల నాగభూషణం, దాసరి ఫ్రాన్సిస్, రాజేశ్వరరావు, అంబటి మాధవరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, షేక్ హుస్సేన్, పెన్షనర్లు పాల్గొన్నారు.

గుంటూరులో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆంధ్రప్రదేశ్ భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు ఈనెల 23, 24 తేదీల్లో పాత గుంటూరులోని శ్రీకష్ణ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక బ్రాడీపేటలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గత ఏడేళ్లుగా భవన నిర్మాణ సంక్షేమబోర్డు పనిచేయకపోవడం వల్ల కార్మికులకు జరుగుతున్న నష్టాన్ని మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణను ఈమహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రాజధాని నిర్మాణాన్ని పటిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం అక్కడి ప్రజలను అవమానించడమేనని అన్నారు. బయట నుంచి తెచ్చిన వలస కార్మికులకు కూడా వలస కార్మిక చట్టాన్ని అమలు చేయట్లేదన్నారు. సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి మాత్రమే వినియోగించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన, ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన ఏ ఒక్క హామీని ఇంతవరకు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండ్రోజులపాటు జరిగే రాష్ట్ర మహాసభల్లో భవన నిర్మాణ కార్మికుల సమస్యల పైన, సంక్షేమ పథకాలు, రాజధానిలో స్థానికులకు ఉపాధి తదితర అంశాల మీద చర్చించి భవిష్యత్ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ మహాసభలకు వివిధ జిల్లాల నుండి 400 ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ మహాసభలకు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని) ఆహ్వాన సంఘం చైర్మన్‌గా, నరేడ్కో ప్రెసిడెంట్ పెరవలి నాగవంశీ ఆహ్వాన సంఘం వైస్ చైర్మన్‌గా, ప్రముఖ ఆర్కిటెక్ కె.ఎస్.కుమార్ ఆహ్వాన సంఘం సహాయ కార్యదర్శిగా మహాసభలకు హాజరవుతారని అన్నారు. మహాసభల నిర్వహణకు కావలసిన సహాయ సహకారాలు బిల్డర్స్, భవన నిర్మాణ రంగానికి సంబంధించిన ప్రముఖులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.కోటేశ్వరరావు, నగర తూర్పు, పశ్చిమ కమిటీల కార్యదర్శులు దీవెనరావు, ఎస్.కె ఖాసింవలి, దూదేకుల మస్తాన్‌వలి, ఎలక్ట్రికల్ యూనియన్ నాయకులు సీతారామయ్య, బోయపాటి అక్కారావు, నికల్సన్, విమల్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు ప్రజాసంఘాలు మద్దతు

షోకాజు నోటీసులు ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు వారి సమస్యల పరిష్కారానికి చేపట్టిన నిరవధిక సమ్మెకు ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. అవసరం అయితే ప్రత్యక్ష ఆందోళనలో కూడా పాల్గొంటామని ప్రకటించాయి. సమ్మెకు మద్దతుగా స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ సమావేశ మందిరంలో సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుండి ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచకపోవటం అన్యాయం అన్నారు. మాట్లాడుతూ ఇంజినీరింగ్ వర్కర్లకు గత ఆరు సంవత్సరాలుగా జీతాలు పెంచకపోవటం అన్యాయం అన్నారు. చాలీచాలని వేతనాలతో, మరోవైపు ఆకాశాన్ని అంటుతున్న ధరలతో ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రకటనలకు పరిమితం కాకుండా కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సమ్మె చేస్తున్న కార్మికులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 16వ తేదీ నుండి పారిశుధ్య కార్మికులు సమ్మెలోకి దిగుతున్నటువంటి నేపథ్యంలో ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి సమస్య పరిష్కరించాలని రౌండ్ టేబుల్ తీర్మానం చేసింది. లేనిపక్షంలో పౌర సమాజంతో కలిసి సమ్మెకు మద్దతుగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మణరావు, బి.ముత్యాలరావు, బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు ఎం సాంబశివరావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ చిష్టీ, జిల్లా అధ్యక్షులు షేక్ భాషా, మెడికల్ రిప్రజెంటివ్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు అబ్దుల్ సలీం, ఎల్ఐసి నాయకులు ఎం రాజేశ్వరరావు, 108 అంబులెన్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బాబు, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఏ యశ్వంత్, కౌలు రైతు సంఘం నాయకులు బైరగాని శ్రీనివాసరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి షేక్ ఖాసిం వలి, అపార్ట్మెంట్ వాచ్మెన్ యూనియన్ నాయకులు ఆది నికల్సన్, ట్రాన్స్పోర్ట్ రంగం నాయకులు షేక్ ఖాసిం షాహిద్ తదితరులు పాల్గొని సమ్మెకు సంఘీభావం తెలిపారు.

పెన్షన్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు



కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా వస్తున్న ఫెన్షనర్లు

కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతోపాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వాలిడేషన్ సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ పెన్సనర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. జిల్లా అధ్యక్షులు కె.పిచ్చయ్య అధ్యక్షతన జరిగిన ధర్నాలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1972 సెంట్రల్ సివిల్ సర్వీసు రూల్స్‌కు చేసిన సవరణ వల్ల కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లతోపాటు, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. సిపిఎస్‌ను కేంద్రం 2004 జనవరి 1 నుండి అమలు చేస్తే మన రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే సంవత్సరం సెప్టెంబర్ నుండి అమలు చేయటమే దీనికి ఉదాహరణ అన్నారు. కావున చట్ట సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రభుదాసు మాట్లాడుతూ పెన్షన్ వ్యాలిడేషన్ బిల్లు వల్ల ముందు ముందు పెన్షనర్లు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎ/డిఆర్‌లను వెంటనే విడుదల చేయాలని, పెన్షనర్లకు, సీనియర్ సిటిజన్లకు అన్ని రైళ్లలో సీనియర్ సిటిజన్ రాయితీ పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అధ్యక్షులు కె.పిచ్చయ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం పెన్షనర్లు అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. పెన్షనర్లకు సమగ్ర వైద్య ఆరోగ్యబీమా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ధర్నా అనంతరం పెన్షన్ వ్యాలిడేషన్ సవరణను రద్దు చేయాలని, పిఎఫ్ఆర్‌డిఎ చట్టాన్ని రద్దు చేసి, ఎన్‌పిఎస్, యుపిఎస్ నిలిపివేయాలని, కేంద్రం 8వ పే కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం కూడా పే కమిషన్ ఏర్పాటు చేయాలని, ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతి ఐదేళ్లకోసారి వేతన సవరణ చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్‌ఓ ఖాజావలికి అందచేశారు.



డిఆర్‌ఒకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు